ప్రజాశక్తి
చిత్తూరు
గురువారం
జనవరి-04
2018
పేజీలు -12

సావిత్రీ బాయి స్ఫూర్తితో అడుగులు...



తిరుపతి హైస్కూల్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న శ్రీదేవి

వార్తలు లోపలి పేజీల్లో...



రైతు రథం.. 'పసుపు' పథం..!

- జడ్‌పి వైస్‌ఛైర్మన్, మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ లబ్దిదారులు
- సిఫార్సుల మేరకు అనర్హులకు అందలం
- దరఖాస్తుకు సైతం నోచని సన్నకారు రైతు
- ఇదీ తూర్పు మండలాల్లో పథకం అమలు తీరు

రైతు రథం 'పసుపు' పథంగా మారింది. సన్న, చిన్నకారు రైతులకు చేకూర్చాల్సిన ట్రాక్టర్లను సిఫార్సుల మేరకు అనర్హులకు అందించారు.. జడ్‌పి వైస్‌ఛైర్మన్, మార్కెటింగ్ కమిటి ఛైర్మన్ లబ్ధిదారులు కావడం గమనార్హం. తూర్పు మండలాల్లో 'పథకం' అమలు తీరును 'ప్రజాశక్తి' యంత్రాంగం పరిశీలించగా టిడిపి పెద్దలకు, నాయకులకు, కార్యకర్తలకు వరంగా ఉందని తేటతెల్లమయ్యింది. సన్న, చిన్నకారు రైతులకు కనీసం దరఖాస్తుకూ అవకాశం లేకపోవడం గమనార్హం. దరఖాస్తు చేద్దామని వ్యవసాయాధికారుల వద్దకు వెళితే 'పసుపు' నేతల సిఫార్సు లేనిదే తామేమీ చేయలేమని చేతులెత్తేస్తుండటం గమనార్హం.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/యంత్రాంగం

చిన్న, సన్నకారు రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు రథం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవసాయ రంగంలో కూలీల సమస్యను అధిగమించడంతో పాటు, పెట్టుబడి, సమయాన్ని ఆదాయం చేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందుకోసం రెండెకరాలు భూమి ఉన్న ప్రతి రైతూ ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆ మేరకు అర్హులకు ట్రాక్టర్లు అందుతున్నాయా? అంటే లేదనే సమాధానం వస్తోంది. సామాన్య రైతు కనీసం దరఖాస్తుకు కూడా నోచుకోవడం లేదని మండిపడుతున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ సిఫార్సు లేఖలు లేనిదే దరఖాస్తు తీసుకోమని వ్యవసాయాధికారులు తెగేసి చెబుతుండటం గమనార్హం. తూర్పు మండలాల్లో రైతు రథం పథకం కింద రెండు విడతలుగా ట్రాక్టర్లను పంపిణీ చేస్తే ఏ ఒక్క సామాన్య రైతుకూ ట్రాక్టర్ అందలేదని 'ప్రజాశక్తి పరిశీలన'లో తేలింది. టీడీపీ నేతలు, భూస్వాములు, బినామీలకే ట్రాక్టర్ల పందేరం జరిగినట్లు తెలుస్తోంది. అయితే ధరను ఎక్కువ చూపి సబ్సిడీ రూపంలో రైతులను మోసం చేసి, కంపెనీలకు అధికమొత్తం ప్రభుత్వం కట్టబెట్టిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. తూర్పు మండలాల్లో అధికశాతం మహీంద్ర, టాఫే కంపెనీలను రైతు రథం కింద పంపిణీ చేశారు. మహేంద్ర 475, టాఫే 241 షోరూమ్ అసలు ధర రూ.5.20లక్షలు. అయితే ప్రభుత్వం రూ.5.80 లక్షలు చూపి రైతుల నుంచి అదనంగా రూ.60 వేలు గుంజుతోంది. ఆ మొత్తాన్ని కంపెనీ ఖాతాలో వేసి పర్సెంటేజీలు తీసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి.

4 లో

హేమాహేమీలు రంగంలోకి

టిడిపిలో మారుతున్న సమీకరణలు

చంద్రగిరికి లోకేష్-తిరుపతికి గల్లా
నగరికి ఐఎఎస్ అధికారి
సంక్రాంతికి 'బాబు' దగ్గర పంచాయితీలు

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

ఎన్నికల హడావిడి మొదలయ్యింది.. ఏడాది వ్యవధి ఉండడంతో ఎవరికివారు తమ బెర్త్‌ను స్థిరం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. విజయవాడ కేంద్రంగా తమ అధినేత చుట్టూ ప్రదక్షిణలు తిరుగుతున్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని చంద్రబాబు కుటుంబంతో సహా నారావారిపల్లికి మూడు రోజుల పాటు ఆనవాయితీగా వస్తారు. ఈ నేపథ్యంలో అధినేత వద్ద పంచాయితీ పెట్టి తమ బెర్త్‌లను స్థిరం చేసుకునేందుకు ఆశావాహులు ఆతృత చెందుతున్నారు.

ఈసారి రాజకీయ ఉద్దండులైన బొజ్జల, గాలి ముద్దుకృష్ణమనాయుడులకు సీటు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే సత్యప్రభ, సుగుణమ్మలకూ కష్టమేనని చర్చ నడుస్తోంది. శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌కు ఖరారైనట్లు తెలుస్తోంది. ఎస్‌సివి నాయుడు తనకే ఇవ్వాలని పట్టుదలతో ఉన్నారు. ఒకవేళ సీటు రాని పక్షంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ తరపున ఎస్‌సివి పోటీ చేసే అవకాశం ఉంది. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తిరుపతి లేదా పలమనేరు నుంచి పోటీ చేయాలని అధినేత సూచించినట్లు సమాచారం. తిరుపతి అమరరాజా ఎంప్లాయీస్ ఎక్కువమంది ఉండడంతో తనకు గెలుపు సునాయాసమని తిరుపతి కోరుకున్నట్లు తెలుస్తోంది. అయితే బలిజ సామాజికవర్గం ఎక్కువగా ఉండడంతో మంత్రి నారాయణ తిరుపతిపై కన్నేసినట్లు చర్చ నడుస్తోంది. సుగుణమ్మకు సీటు వచ్చే పరిస్థితి లేదని సమాచారం. తిరుపతి పార్లమెంట్ సీటులో టిడిపి పోటీ చేస్తే చిత్తూరు అసెంబ్లీ సికెబాబుకు ఇవ్వాలని లోపాయికారి ఒప్పందానికి బిజెపి చేసుకున్నట్లు తెలుస్తోంది. 4 లో

ఐఐటి, ఐసర్ నిర్వాసితులకు న్యాయమేది?

జన్మభూమిలో అధికారులను నిలదీసిన సిపిఎం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

'ఐఐటి, ఐసర్ కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరగలేదు' అని సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య అధికారులను ప్రశ్నించారు. ఏర్పేడు మండలం జంగాలపల్లిలో బుధవారం జరిగిన 'జన్మభూమి–మా ఊరు' కార్యక్రమంలో పుల్లయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐటీ, ఐసర్ నిర్వాసితుల ప్రతినిధిగా అధికారులను నిలదీశారు. 4 లో



జన్మభూమిలో నిలదీస్తున్న సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య

సావిత్రీబాయి పూలే ఆశయాలను నెరవేరుద్దాం

ప్రజాశక్తి-పుత్తూరు అర్బన్

దేశంలో తొలి ఉపాధ్యాయిని అయిన సావిత్రిబాయి పూలే సేవలు మరువరానివని సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు కొనియాడారు. బుధవారం పుత్తూరు పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1848లో మహారాష్ట్రలోని పూణేలో బాలికల కోసం మొట్టమొదటి పాఠశాలను సావిత్రిబాయి పూలే ఏర్పాటు చేశారన్నారు. అయితే అది నచ్చని అగ్రకులవాదులు ఆమెపై భౌతికదాడులు చేశారని, అయినప్పటికి పట్టువదలకుండా బాలికల, మహిళాలోకాన్ని జాగృతి చేశారని గుర్తు చేశారు. మహిళల హక్కుల కోసం, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాన్ని సాగించిందన్నారు. ఆ సమయంలోనే అత్యంత భయంకరమైన ప్లేగు వ్యాధి నుండి పిల్లలను రక్షిస్తూ, చివరికి ఆ వ్యాధిబారిన పడి 1887లో ఆమె చనిపోయారని తెలిపారు. నేడు మహిళలపై ప్రతి రోజు దినపత్రికలలో, మీడియాలో వస్తున్న దౌర్జన్యాలు, అత్యాచారాలు చూస్తుంటే మళ్లీ సావిత్రిబాయి పూలే జన్మించి మహిళా లోకాన్ని జాగృతి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని బాలికా అక్షరాస్యతా దినంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి మాట్లాడుతూ నేటి పరిస్థితులకు అనుగుణంగా ప్రతి విద్యార్థిని సావిత్రిబాయి పూలేలా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు వెంకటేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థీనులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వందవాసి నాగరాజు

నగరి : సావిత్రిబాయ్ పూలే ఆశయాలను నెరవేరుద్దామని వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సావిత్రిబాయ్ పూలే జయంతి సమావేశాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యాక్షులు టి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు బాలికల విద్యపై సరైన శ్రద్ధ వహించడం లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 69 సంవత్సరాలు దాటినా బాలికల అక్షరాస్యత మాత్రం 50 శాతం దాటలేదన్నారు. గిరిజన, దళిత, బలహీనవర్గాల మహిళల్లో అక్షరాస్యత మరింత తక్కువగా ఉందన్నారు. 186 సంవత్సరాల క్రితం సావిత్రిబాయి పూలే అవమానాలను, దాడులను ఎదుర్కొంటే నేడు కూడా మహిళలపై అత్యాచారాలు మిన్నంటుతున్నాయన్నారు. అందుకే సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రఘుపతి, డివిజన్ కార్యదర్శి నాగరాజు పవర్ లూమ్స్, విజి భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి జయంతిని మహిళా విద్యా దినోత్సవంగా ప్రకటించాలి

కెవిపిఎస్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సావిత్రీబాయి జయంతిని ప్రభుత్వం మహిళా విద్యా దినోత్సవంగా ప్రకటించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండు చేశారు. స్థానిక బైరాగిపట్టెడలోని ఎంజిఎం హైస్కూల్‌లో సావిత్రిభాయి పూలే 187వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగు బాషోద్యమ సమితి అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ 1831లో జన్మించి 9 సంవత్సరాలకి వివాహమాడి తన భర్త దగ్గర విద్యాభ్యాస్యం చేసి దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలయ్యిందని గుర్తు చేశారు. సావిత్రిభాయి నేటి మహిళలకు ఆదర్శనీయురాలని కొనియాడారు. యుటిఎఫ్ జిల్లా నాయకురాలు డి.నిర్మలా మాట్లాడుతూ నాడు మహిళల కోసం 18 పాఠశాలలు నిర్మించిన త్యాగమూర్తి అని, మహిళలు చదువుకుంటే దేశాభివృద్ధి సాధ్యమవతుందని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ మహిళా ఉద్దరణ అంటూ ప్రగల్భాలు పలుకుతున్న ప్రభుత్వాలు, వాస్తవానికి మహిళల పట్ల వివక్షత చూపుతూ వారిని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంచుతున్నారని ఆవేదన వ్యకప్తం చేశారు. 160 సంవత్సరాల క్రితమే మహిళోద్ధారణ కోసం పాటుపడిన సావిత్రిభాయి జయంతిని మహిళా విద్యా దినోత్సవంగా ప్రకటించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో మధుసూధన్, డివైఎఫ్ఐ నాయకులు సందీప్, కెవిపిఎస్ నగర కార్యదర్శి ఎన్‌డి.శ్రీను, శ్రీనివాసులు, రజని, బాలసుబ్రమణ్యం, బాలకృష్ణ, రవికుమార్, మునిశారద, రమణమ్మ, అనిల్‌కుమార్, మాలతి, సుధాకర్, నసీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి : సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అర్హతగల లబ్దిదారులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి సబ్‌కలెక్టరు నిషాంత్‌కుమార్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని సప్తగిరినగర్‌లో బుధవారం జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టరు మాట్లాడుతూ గత 4 జన్మభూమి కార్యక్రమాల్లో అందిన సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు. జన్మభూమి సభల్లో ప్రజల భాగస్వామ్యం పూర్తిస్థాయిలో ఉంటేనే ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదుగగలరన్నారు. గతంలో రెవిన్యూ అధికారులు ఇంటింటికి తిరిగి దీపం పథకం అమలు చేసి మహిళలకు గ్యాస్‌కనెక్షన్లు పూర్తి స్థాయిలో అందించారన్నారు. 100 గజాలలోపు పేదల ఇళ్లను క్రమబద్దీకరిస్తున్నామని తెలిపారు. కార్పొరేషన్ కమిషనర్ హరికిరణ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎక్కడలేని విధంగా వార్డు దర్శిణి కార్యక్రమం చేపట్టామన్నారు. తుడా చైర్మన్ నరసింహయాదవ్ మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి ఈ జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి ఎంఎల్‌ఏ సుగుణమ్మ మాట్లాడుతూ ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు వచ్చి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను జన్మభూమి ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహశీల్దారు చంద్రమోహన్, డిటి శివకుమార్, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు, సప్తగిరినగర్ వాసులు పాల్గొన్నారు.

పేదల సంతోషమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-పెనుమూరు

పేదల సంతోషమే ప్రభుత్వ లక్ష్యమని డిఆర్‌డిఎ టిడి రవిప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. 5వ విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మండలంలోని శర్వగాని పల్లి, గుంటిపల్లి, ఉద్యానంపల్లిలో బుధవారం గ్రామ సభలు అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో నూతనంగా 349 పెన్షన్లు మంజూరు చేశారని, ఇంకా అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి హరిబాబు నాయుడు, జడ్‌పిటిసి రుద్రయ్యనాయుడు, మోహన్ నాయుడు, ఎంపిడిఒ పార్వతమ్మ, సర్పంచులు వెంకటేశ్, శారదమ్మ, తహశీల్దార్ రవి, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయండి

ప్రజాశక్తి-నింద్ర

కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని మండల ఎస్‌టియు అధ్యక్షుడు జంపురం శివప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో రాష్ట్రోపాధ్యాయ సంఘ డైరి, క్యాలెండర్‌ను మండల విద్యాశాఖాధికారి నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేసిన ఘనత ఎస్‌టియుదేనని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఎస్‌టియు ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఏకీకృత సర్వీస్ నిబంధనలు తీసుకురావడంలో రాజీలేని పోరాటం చేసి విజయం సాధించిందన్నారు. ఎయిడెడ్ ఉపాధ్యాయులకు నెలనెలా జీతం అందించడంలో కృషి చేసిందని, మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, ఎస్‌జిటిలు కూడా ఎంఎల్‌సి ఎన్నికలలో ఓటు హక్కు కల్పించడానికి సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, జనరల్ సెక్రటరీ గోపి, అదనపు కార్యదర్శులు రాజేంద్రరాజు, మధు, బాలబ్రహ్మానందం, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చేనేత కార్మికుల అభివృద్ధి వైసిపితోనే సాధ్యం



ప్రజా సంకల్ప యాత్రలో వైయస్ జగన్‌తో డిఎన్ ఏలుమలై

పుత్తూరు అర్బన్: కష్టాల కడలిలో జీవితాన్ని వెల్లదీస్తున్న చేనేత కార్మికులకు ఆదుకునేందుకు, వారి జీవితాలను భరోసా కల్పించే విధంగా బీమా పథకాన్ని ప్రకటించిన వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుత్తూరు వైఎస్‌ఆర్‌సిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డియన్ ఎలుమలై కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పీలేరు నియోజకవర్గంలో వైయస్‌ఆర్‌సిపి అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాసంకల్ప యాత్రలో నగరి ఎమ్మెల్యే ఆర్‌కే రోజా ఆధ్వర్యంలో పుత్తూరు వైయస్‌ఆర్‌సిపి నాయకులు తమ అధినేతను కలిశారు. ఈ సందర్భంగా డియన్ ఎలుమలై పవర్‌లూమ్ కార్మికుల కష్టాలను వైయస్ జగన్ వివరించారు. అలాగే ఒక కుటుంబం పూర్తిగా 18 గంటల సేపు కష్టపడినప్పటికి రూ.300 కూడా రావడం లేదని వివరించారు. ప్రక్కరాష్ట్రం తమిళనాడు తరహాలో మరమగ్గాలకు ఉచిత విద్యుత్ అంశాన్ని పరిశీలించాలని ఆయన వైయస్ జగన్‌కు విజ్ఞప్తి చేయడంతో, సమస్యలపై సానుకూలంగా స్పందించి మరమగ్గాల కార్మికులను అదుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. వైయస్ జగన్ పాదయాత్రలో పుత్తూరు వైయస్‌ఆర్‌సిపి నాయకులు రవిశేఖర్‌రాజు, ప్రతాప్, శ్రీధర్‌రాజు, బాబురావ్‌గౌడ్, సుబ్రమణ్యంరెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జన్మభూమి ప్రత్యేక అధికారి, జిల్లా ఫారెస్ట్ అధికారి జగన్నాథసింగ్ పేర్కొన్నారు. పుత్తూరు రూరల్ మండలంలో జన్మభూమి, మా ఊరు గ్రామ సభను కెబిఆర్‌పురం గ్రామంలో మండల అధ్యక్షులు గంజిమాధవయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జన్మభూమి ప్రత్యేక అధికారి జగన్నాథసింగ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పేద ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి సాయం చేయడం కోసమే జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు.అనంతరం నూతనంగా రేషన్ కార్డులు మంజూరైన వారికి పంపిణీ చేసి, చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుభద్రమ్మ, మోహన్‌రాజు, మండల పార్టీ అధ్యక్షుడు కరుణాయాదవ్, బాబు నాయుడు, నిర్మలాదేవి, వ్యవసాయాధికారి లక్ష్మీదేవి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిఎం మునెయ్య, హౌసింగ్ ఎఇ, గ్రామస్తులు పాల్గొన్నారు.



చంద్రన్న కానుకలను పంపిణీ చేస్తున్న దృశ్యం

300 పడకల ఆస్పత్రిపై విచారణ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

నిరుపేద గర్భవతులకు కాన్పు చేసేందుకు తిరుపతిలో ఏర్పాటు చేసిన 300పడకల కాన్పుల ఆసుపత్రిపై కేంద్ర మాజీ మంత్రి డాక్టరు చింతామోహన్ చేసిన ఫిర్యాదుపై కేంద్రం స్పందించింది. ఈ ఆసుపత్రి పురోభివృద్ధి గురించి సమగ్ర విచారణ జరిపి, నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ రీజినల్ డైరెక్టరు డాక్టరు అనురాధ బుధవారం సాయంత్రం 300 పడకల కాన్పుల ఆసుపత్రిని సందర్శించారు. అనంతరం ఎస్‌వి మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో ప్రిన్సిపాల్ ఎన్‌వి.రమణయ్య, వివిధ విభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణం పూర్తయి నాలుగు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు ఆసుపత్రి అందుబాటులోకి రాలేదు. డాక్టరు అనురాధ విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా 20 కోట్ల రూపాయలు నిధులు దారి మళ్లినట్లు గుర్తించారు. నిరుపేద గర్భవతుల ఆరోగ్యం కోసం కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించినట్లు గుర్తించారు. హెచ్‌ఐడిఎంసి అధికారుల తీరుపై ఆమె అసహనం వ్యక్తం చేవారు. జరిగిన పొరబాటును కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆమె పేర్కొన్నారు.

జయాల్‌వల్లి సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి ఈఎస్‌ఐ ఆసుపత్రి సీనియర్ అసిస్టెంట్ ఏపిఎన్‌జీవో కోశాధికారి ఎస్.జయాల్ వల్లి సేవలు ఆదర్శనీయమని ఆ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు అబ్దుల్ మజీద్ తెలిపారు. స్థానిక ఈఎస్‌ఐ ఆసుపత్రి ప్రాంగణంలో పదవి విరమణ చేసిన జయాల్‌వల్లికి బుధవారం ఘనంగా సత్కారం చేశారు. ఏపి ఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ధనంజయనాయుడు మాట్లాడుతూ జయాల్‌వల్లి ముస్లిం వ్యక్తి అయినప్పటికి ఎంతో మంది ఎన్‌జీవో నాయకులు, అధికారులను స్వయంగా వెంకన్న సేవకు తీసుకెళ్లిన లౌకికవాదని పేర్కొన్నారు. అనంతరం ఆయన్ని గజపూలమాలలు, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణకుమారి, డాక్టరు బాలశంకర్, డాక్టరు జనార్ధన్, డాక్టరు రామదాసు, కృష్ణమనాయుడు, సురేస్‌బాబు, ఈఎస్‌ఐ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు నిర్ణయంపై హర్షం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఎస్‌విబిసిలో జరుగుతున్న అవినీతిపై నివేదిక ఇవ్వాలని సాక్షాత్తు హైకోర్టు టిటిడికి ఆదేశాలు ఇవ్వడం పట్ల రాయలసీమ పోరాట సమితి నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌విబిసిలో జరుగుతున్న అవినీతిపై అనేక సార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీనిపై హైకోర్టు స్పందించి ఎస్‌విబిసి అవకతవకలపై నివేదిక ఇవ్వాలని సివిఎస్‌వో, టిటిడి ఈవోను ఆదేశించిందన్నారు. ఎస్‌విబిసి సిఈవోపై విచారణ జరుగుతున్న ఆయన నేరుగా కార్యాలయానికి వచ్చి రికార్డులు తారుమారు చేస్తున్నా ఎవ్వరూ పట్టించుకపోవడం సరైనది కాదన్నారు. సిఈవో విచారణ పూర్తయ్యే వరకు ఎస్‌విబిసి కార్యాలయానికి రాకుండా టిటిడి ఈవో చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు.

ఘనంగా సావిత్రీ బాయి పూలే జయంతి వేడుకలు

కలికిరి: దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయిపూలే 187వ జయంతి కలికిరి గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా హాజరైన జ్యోతిరావుపూలే జనపరిషత్ కన్వీనర్ బివి.రమణయాదవ్ మాట్లాడుతూ భర్త సహాయంతో విద్యను నేర్చుకొని బడుగు బలహీన వర్గాల వారికి సహాయం చేసిన మహోన్నత మహిళ సావిత్రిబాయి పూలే అన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ ఆమె స్ఫూర్తితో మహిళలందరూ విద్యను కొనసాగించాలని పిలుపునిచ్చారు. దేశ నాయకులు సావిత్రిబాయి పూలే జయంతిని ఉపాధ్యాయదినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ క్రిష్ణవేణి, జెన్‌టియు ప్రిన్సిపల్ ఈశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సిఐటియు నాయకులు డెవిడ్‌కుమార్ యాదవ్, సుఫీ బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: భారత దేశంలో ఆడపిల్లలకు చదువు కోసం మహోన్నతమైన పోరాటం చేసిం విద్యను అందించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అని భారతీయ అంబేద్కర్‌సేన మహిళా విభాగం అధ్యక్షురాలు బుట్టిగార్ల వరలక్ష్మి తెలిపారు. స్థానిక కాలనీగేటు వద్ద అంబేద్కర్ సర్కిల్‌లో సావిత్రీభాయి పూలే 188వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గంగులమ్మ, రమణమ్మ, రెడ్డమ్మ, స్వాతి, బాస్‌నాయకులు రమణన్న, గిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: బాలికలందరూ సావిత్రీబాయి పూలే అడుగుజాడల్లో నడవాలని రొంపిచెర్ల ఎసై నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు ఆమె ఎనలేని కృషి చేశారన్నారు. సమాజంలో ఎన్ని అవమానాలు ఎదురైనా మడమతిప్పకుండా స్త్రీ అక్షరాస్యతకు పాల్పడిన మహిళ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మునికృష్ణకుమారి, బిసి సంఘం జిల్లా నాయకులు నారాయణస్వామి, ఎంఆర్‌పిఎస్ నాయకులు సుబాష్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: స్త్రీ విద్యా వ్యాప్తికి విశేష కృషి చేసిన సావిత్రీ బాయి పూలే జయంతిని స్థానిక బాలయోగి గురుకులం బాలికల పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిభాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపియం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాడ గంగరాజు, ప్రిన్సిపల్ కన్యాకుమారిలు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జ్యోతిరావుపూలే, సావిత్రిభాయి పూలే దంపతులు విశేష కృషి చేశారని కొనియాడారు. మొట్టమొదటి సారిగా బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాలను ప్రారంభించి, మహిళల్లో అక్షరాస్యతకు ఎనలేని కృషి చేశారన్నారు. సావిత్రిభాయి పూలే జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనపరిషత్ సామాజిక ప్రజా సంఘాల నాయకులు రమణ యాదవ్, వెంకటేష్, శేఖర్, గణేష్, ఉపాధ్యాయులు సుజాత, మల్లీశ్వరీ, విజయాంబ, రమాదేవి, ధనలక్ష్మి, పాఠశాల సిబ్బంది దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వాడ గంగరాజు

రైతులకు ఆర్థిక సహకారం అందిస్తాం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: కిషాన్ సువిధ రైతు సంఘంలోని రైతులకు ఆర్థిక సహకారం అందిస్తామని కొత్త రకం పంటలు సాగు చేసే రైతులకు రుణాలు మంజూరు చేస్తామని స్టేట్ బ్యాంకు రీజనల్ మేనేజర్ పూర్ణచంద్రరావు తెలిపారు. బుధవారం చిన్నగొట్టిగల్లు మండలంలోని దీందార్లపల్లెలో కిషాన్‌సువిధ రైతు సంఘం సమావేశం నావ కంపెనీ డైరెక్టర్ అబ్దుల్‌ఆలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు ఇస్తామన్నారు. రైతులు తీసుకునే రుణాలు సద్వినియోగం చేసుకుని సుస్థిర అభివృద్ధిని సాధించాలన్నారు. రైతులకు క్రెడిట్ కార్డులు, సబ్సిడీ ఎరువులు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాకరాపేట స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఇంద్రాని, విడిసి బేనేజర్ సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CHITTOOR.
M.V.O.P. No. 181 of 2017

Between:
K.M. Lokesh ... Petitioner
And:
C.Krishnamurthy & others ... Respondents

SUMMONS TO THE RESPONDENT No.2

TO
C. Chandrasekhar S/o Jayaram Naidu, Cheekurupalli Village, K.G.Satram Post, Bangarupalyam Mandal, Chittoor District. A.P.

Sir,

Please take notice that the above suit is posted to 31-01-2018 for your appearance before the said court. Please be present on the said date before the said court at 10-30 A.M. either in person or through an Advocate and to raise objections if any, failing which the matter will be decided in your absence as ex-parte.

Hearing date: 31-01-2018.

M. DAMODARAM
ADVOCATE

IN THE COURT OF THE 1 ADDITIONAL JUNIOR CIVIL JUDGE MADANAPALLE
O.S.NO. 374-2017

Plaintiff : - G.Sudarsanamma
Defendant:- S.Chandra Sekhar Naidu

SUMMONS TO DEFENDANT

S.Chadra Sekhar Naidu S/o Ragunatha Naidu, D.No. 2-256-B-2-1, West Kurava vanka Madanapalle.

పై కేసులో కోర్టు నుండి వచ్చు నోటీసులను తీసుకోనందున పేపరు ప్రకటన ద్వారా 08-01-2018 నందు ఉదయం 10:30 గంటలకు నీ హాజరునిమిత్తం ఉన్నది. నీవు హాజరు కానంతట నీపై పరోక్షమున తీర్మానించబడును.

By order fo the court
D.Venkataramana Reddy, M.A., LL.B.,
Advocate, Madanapalle.

గుర్తు తెలియని వాహనం ఢీ

వ్యక్తికి తీవ్రగాయాలు , కాపాడిన డిఎస్‌పి చౌడేశ్వరి



తీవ్ర గాయాలతో పడి వున్న ధనరాజ్

ప్రజాశక్తి-పలమనేరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నక్కపల్లిలో చోటు చేసుకుంది. స్థానిక వివరాలమేరకు రూరల్ మండలం పి.వడ్డూరుకు చెందిన కుప్పయ్య కుమారుడైన ధనరాజ్(30) నంగిలి దగ్గర తన సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా నక్కపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో అతని తలకు బలమైన గాయాలతో పడిపోయాడు. అదేసమయంలో మంత్రి, కలెక్టర్ల పర్యటన నిమిత్తం వి.కోటకు వెళుతున్న డిఎస్‌పి చౌడేశ్వరి అతనిని చూసి తన వాహనంలో ఏరియా ఆస్పత్రిలో చేర్పించి ప్రాణపాయం నుంచి కాపాడాలని డాక్టర్లను కోరారు. డాక్టర్లు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం వేలూరు సిఎంసికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని విధాలా అండగా ఉంటా... జగన్

ప్రజాశక్తి-వాల్మీకిపురం: రాష్ట్రంలో నాలుగు సంవత్సరాల చంద్రబాబునాయుడు పరిపాలన విశ్వసనీయతకు పాతర వేసిందని ప్రతిపక్షనేత వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. 51వ రోజు బుధవారం ప్రజా సంకల్పయాత్ర వాల్మీకిపురం మండలం చింతపర్తి నుంచి ప్రారంభమై కలికిరికి చేరుకొంది. పాదయాత్రలో మహిళలు, రైతులు, చేనేత కార్మికులు, మైనార్టీలు జగన్‌ను కలుసుకొని తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి రాగానే చేనేత కార్మికులు, రైతన్న ఆత్మహత్యల నివారణకు వైఎస్సార్ బీమా చేపట్టనున్నట్లు తెలిపారు. నవరత్నాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించింది రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకే అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, నగిరి ఎమ్మెల్యే ఆర్‌కే రోజా, పీలేరు నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ విధానంతో వరి నాట్లు

ప్రజాశక్తి-పీలేరు: యాంత్రీకరణ విధానంతో వరినాట్లు ప్రప్రథమంగా సాగు చేయడం వలన రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని పీలేరు సహాయ సంచాలకులు శ్రీలత, ఆత్మబీటీఎం జోత్స్నలు అన్నారు. బుధవారం మండలంలోని తలపుల పంచాయతీ ఎరుకులవారిపాళెం గ్రామంలో మల్లికార్జునరెడ్డి అనే రైతు పొలంలో ప్రప్రథమంగా వరినాట్లు సాగు చేస్తుండడంతో ఈ విధానం వలన ప్రధానంగా రైతులకు కూలీల ఖర్చు చాలావరకు తగ్గుతుందని అన్నారు. ఒక ఎకరం వరినాట్లు వేయడానికి సన్న రకం వడ్లు అయితే 20 కిలోలు, లావు రకం వడ్లు అయితే 22 కిలోలు సరిపోతాయని అన్నారు. నారు పోసిన 18 రోజులకు వరినాట్ల యంత్రం సహాయంతో ప్రధాన పొలంలో నాటుకోవచ్చునని అన్నారు. ప్రస్తుత కాలంలో కూలీల కొరత ఎక్కువగా ఉండడం వలన ఈ యాంత్రీకరణ విధానంతో కూలీల ఖర్చును తగ్గించుకుని పెట్టుబడిని తగ్గించవచ్చునని, మంచి దిగుబడులను సాధించుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జయబ్బనాయుడు, అమరనాధరెడ్డి పాల్గొన్నారు.



జీపు బోల్తా-నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి: తిరుమల నుంచి తిరుపతికి వచ్చే దారిలో జంగిల్‌బుక్ సమీపం వద్ద బుధవారం ఉదయం ఓ జీపు బోల్తా పడిన సంఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు తిరుమల నుంచి తిరుపతి వైపు భక్తులతో వస్తున్న ఏపి22 యు 9378 నెంబరు గల కమాండర్ జీపు వేగంగా వస్తూ కపిలతీర్థం సమీపంలోని జంగిల్‌బుక్ వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కకు బోల్తా పడింది. ఈ సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న నలుగురు భక్తులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం రుయాకు తరలించారు.

హోటల్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-తిరుపతి సిటి: రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ హోటల్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. తిరుపతి రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారానికి ఎదురుగా ఉన్న ఆనంద్‌భవన్‌లో బుధవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. హోటల్‌లోని స్టోర్‌రూమ్ గదిలో మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో హోటల్ స్టోర్‌రూమ్‌లోని సరుకులు మొత్తం అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: ఎన్నో సంవత్సరాలుగా గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ముఠాను ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి దాడులు నిర్వహించి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం మండలంలోని కట్టకిందపల్లి పేనేడు చెరువులో కొన్ని సంవత్సరాలుగా అదే గ్రామానికి చెందిన నలుగురు స్థావరాన్ని ఏర్పాటు చేసి పేకాట నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో రహస్యంగా అందిన సమాచారంతో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి సాయంత్రం 6 గంటల ప్రాంతంలో దాడులు చేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.12 వేల 150 నగదును, నాలుగు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా పారిపోయిన వారి వద్ద అధిక మొత్తం డబ్బులు ఉన్నాయని ఎస్ఐ తెలిపారు. ఇక్కడికి చిత్తూరు, పోన్నై, పల్లిపట్టు ప్రాంతనుండి వస్తుంటారని తెలిపారు. కట్టకింద పల్లి గ్రామానికి చెందిన గిరిబాబు, వెంకటేష్, అరుణ్, చిట్టిబాబు, ప్రేమ్‌కుమార్, వాసులతో పాటు చిత్తూరుకు చెందిన రుక్మనాంధనాయుడు, వాసురెడ్డి, తమిళనాడు పల్లిపట్టుకు చెందిన గొవిందరెడ్డి ఉన్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సావిత్రీబాయి స్ఫూర్తితో ముందుకు...

ప్రజాశక్తి-పీలేరు: భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రీభాయిపూలే అని శాసన మండలి సభ్యులు యండపల్లి శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం సావిత్రీభాయిపూలే 185వ జయంతిని పురష్కరించుకుని పీలేరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈసమాజ మార్పుకు విద్య ఒక్కటే సాధనమని ముఖ్యంగా బాలికల విద్య సాంఘీక దురాచార తెర నుండి బయటపడేయడం సాధ్యమవుతుందన్నదే సావిత్రీభాయిపూలే ఆశయమని గుర్తు చేశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.రాధాకృష్ణ, నాయకులు ఎస్.శివారెడ్డి, చెంగల్రాయులు, ఈశ్వర్‌మహేంద్ర, వీఎస్ఎన్ కరస్పాండెంట్ మాధవి, ఉపాధ్యాయులు యువరాణి, ధనలక్ష్మి, సుజాత, ఉమారాణి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

పీలేరు: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతాయని ఇందులో అపోహపడాల్సిన అవసరం లేదని టిడిపి జిల్లా కార్యదర్శి కోటపల్లె బాబురెడ్డి అన్నారు. బుధవారం జన్మభూమి రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా మండలంలోని అగ్రహారం పంచాయతీ కేంద్రంలో ఆరోగ్యం, ఆనందం అనే అంశంపై జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి గోపీచంద్, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, ఎంపిడిఒ వసుంధర, తహశీల్దార్ మునిప్రకాశం, తదితరులు పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

హేమాహేమీలు రంగంలోకి

శివప్రసాద్‌కు కాకుండా కొత్త వ్యక్తిని రంగంలోకి తీసుకొచ్చే ఆలోచనలో బాబు ఉన్నట్లు సమాచారం. చంద్రగిరి నుంచి తన కొడుకు లోకేష్‌ను ప్రత్యక్ష ఎన్నికల్లో రంగంలోకి దింపనున్నారు. నగరిలో ఆర్‌కె రోజాకు ధీటుగా తిరుమల జెఇఒ శ్రీనివాసరాజును నిలబెట్టే యోచన ఉంది. సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ అశోక్‌రాజు సైతం తాను బరిలో ఉంటానని బాబును అడిగినట్లు సమాచారం. సత్యవేడు సిట్టింగ్ ఎంఎల్‌ఎ తలారి ఆదిత్యపై జనంలో వ్యతిరేకత ఉండడంతో మాజీ ఎంఎల్‌ఎ హేమలతను మళ్లీ తెరపైకి తెచ్చే అవకాశం ఉంది. పూతలపట్టు మాజీ ఎంఎల్‌ఎ లలితకుమారికి, పీలేరుకు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి బెర్త్‌లు దాదాపు ఖరారైనట్లే. తంబళ్లపల్లి ఎంఎల్‌ఎ శంకర్‌కు కాకుండా కొత్తవారికి ఇచ్చే అవకాశం ఉంది. మదనపల్లిలో మాజీ ఎంఎల్‌ఎ దొమ్మలపాటి రమేష్, రాందాస్ చౌదరి పేర్లు వినిపిస్తున్నాయి. రాజంపేట పార్లమెంట్‌కు బిజెపి పొత్తు కుదిరితే మాజీ మంత్రి పురంధేశ్వరికే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జీడీనెల్లూరు గుమ్మడి కుతూహలమ్మ కొడుకు హరిక్రిష్ణకు సీటు వస్తుందని నమ్మకంగా ఉన్నారు. పుంగనూరు పెద్దిరెడ్డికి ధీటుగా మంత్రి అమరనాథరెడ్డిని నిలబెట్టే యోచన ఉంది.

ఐఐటి, ఐసర్ నిర్వాసితులకు న్యాయమేది?

ప్రతిష్టాత్మక ప్రాజెక్టులంటూ రైతులను భయపెట్టి భూ సేకరణ చట్టానికి వ్యతిరేకంగా భూములను లాక్కున్నారని మండిపడ్డారు. తీరా రైతులను నయానో భయానో ఒప్పించాక వారికిస్తామన్న పరిహారం, నెరవేరుస్తామన్న హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఐఐటీ, ఐసర్ స్థాపనకు ఏర్పేడు, జంగాలపల్లి పంచాయతీల్లో సుమారు 300 ఎకరాలు లాక్కుని నేటికి మూడేళ్లు గడిచి పోయినా బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహించారు. 2013 భూ సేకరణకు బదులు ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములను సేకరించడం వల్ల రైతులు నష్టపోయారని వాపోయారు. అదీ కాకుండా నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం, ఇంటి స్థలం, చెట్టుకూ, పుట్టకు, బావికి, గొయ్యికి సైతం పరిహారం చెల్లిస్తామని గ్రామ సభలు పెట్టి మరీ వాగ్దానం చేసిన కలెక్టర్, తహశీల్దార్ మరి ఎందుకు హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. బాధిత రైతుల తరపున 40 రోజుల నిరాహార దీక్షకు పూనుకుంటే దిగవచ్చిన జేసీ నెల రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారనీ, మరి మూడు నెలలు గడుస్తున్నా పరిష్కారం ఎందుకు చేయలేదంటూ నిలదీశారు. సమస్యలు పరిష్కరించలేనప్పుడు ప్రజల్లో ఏ ముఖంతో వస్తారన్నారు. ఇప్పటికైనా ఐఐటీ, ఐసర్ నిర్వాసితులకు న్యాయం చేయకుంటే మరోమారు ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. సీపీఎం నాయకులు బాలకృష్ణ, గురవమ్మ, రంగయ్య, చెంగల్రాయులు, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ సంఘం నాయకులు ఎస్‌పిడిసిఎల్ అధికారులకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి బస్టాండు వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేసి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎపిఎస్‌పిడిసి ఆపరేషన్, ట్రాన్స్‌కో రూరల్ డివిజన్ కార్యాలయాల ముందు నిరసన తెలియజేసి అధికారులకు సమ్మె నోటీసు సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేసి నేరుగా జీతాలు ఇవ్వాలని, సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, దశలవారీగా క్రమబద్ధీకరించాలని, కార్మికుడు మరణిస్తే వారి కుటుంబాలకు 20 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇస్తూ సంస్థలో ఉద్యోగం ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ డిమాండ్లు ఈ నెల 27వ తేదిలోపు నెరవేరని పక్షంలో 27న రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులతో కలిసి నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో ఆ సంఘం నాయకులు ప్రహ్లాదయ్య, సుధాకర్, హరినాథ్, గుణ, రామనాథం, రమేష్, ఉదయ్‌కుమార్, చిరంజీవి, అనిల్, దివాకర్, భానుప్రసాద్, ముని, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీవారి ప్రణయకలహోత్సవం

ప్రజాశక్తి-తిరుమల: తిరుమలలో శ్రీవారి ఆలయంలో ప్రణయ కలహోత్సవం వేడుకగా జరిగింది. ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి సరిగ్గా ఆరో రోజు, అధ్యయనోత్సవంలో 17వ రోజు తిరుమలలో ఈ ప్రణయ కలహోత్సవం నిర్వహించడం ఆనవాయితి. ఇందులో బుధవారం శ్రీమలయప్ప స్వామి వారు పల్లకి ఎక్కి మహాప్రదక్షిణ మార్గంలో స్వామి పుష్కరిణి వద్దకు వేంచేశారు. ఈలోపు అమ్మవార్లు చెరొక పల్లకిపై అప్రదక్షిణంగా స్వామివారికి ఎదురుగా వచ్చి నిల్చుంటారు. పురాణ పఠనం జరుగుతుండగా అమ్మవార్ల తరపున జియ్యంగారు పూల చెండ్లతో వేటకు వెళ్లి వచ్చిన స్వామివారిని మూడుసార్లు ఆడిస్తారు. స్వామివారు బెదిరినట్లుగా నటించి తానేమీ తప్పు చేయలేదని అమ్మవార్లను ప్రాధేయపడతారు. ఇదే స్వామి అమ్మవార్ల ప్రణయ కలహోత్సవం. అనంతరం అమ్మవార్లు శాంతించి స్వామి వారికి ఇరువైపులా చేరి కర్పూర హారతులు భక్తుల నుండి అందుకుని ఆలయానికి చేరారు. ఆ తరువాత ఆస్థానాన్ని అర్చకులు నిర్వహించారు. ఈ ఉత్సవంలో శ్రీ నమ్మాళ్వార్ రచించిన ఆళ్వార్ దివ్య ప్రబంధంలోని పాసురాలను నింద – స్తుతి శైలిలో అర్చకులు పారాయణం చేయడం ప్రత్యేకత భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో వసంతోత్సవాన్ని టిటిడి రద్దు చేసింది.



ఈ కార్యక్రమంలో పెద్ద జీయ్యర్, చిన్న జీయ్యర్ స్వాములు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్, ఆలయ డిప్యూటీ ఇవో కోదండరామరావు, పేష్కార్ రమేష్‌బాబు, ఆలయ ఒఎస్‌డి డాలర్ శేషాద్రి, బొక్కసం ఇన్‌చార్జ్ సబేరాం పాల్గొన్నారు.

ధీరవనిత సావిత్రీబాయి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాధవకృష్ణ

ప్రజాశక్తి - క్యాంపస్: మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం సాధన కోసం పోరాడిన ధీర వనిత సావిత్రిభాయి పూలే అని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎన్. మాధవకృష్ణ పేర్కొన్నారు. బుధవారం సావిత్రిబాయిపూలే 187వ జయంతి, మహిళా ఉపాధ్యయ దినోత్సవంను ఎస్వీయూలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవకృష్ణ మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన సావిత్రి బాయి పూలే చిన్నతనంలోనే మహాత్మ జ్యోతిరావుపూలేను పెళ్లాడారని తెలిపారు. జ్యోతిరావుపూలే ఆదర్శ భావాలు, ఆలోచనలకు ప్రతిరూపంగా సావిత్రిబాయి ఆయన అడుగుజాడల్లో నడిచినట్లు వెల్లడించారు. మహిళలకు విద్యను అందించాలని లక్ష్యంతో పోరాడినట్లు పేర్కొన్నారు. మహిళలను విద్యావంతులు చేయాలని బాలికల పాఠశాలను ఏర్పాటు చేసి, ఎన్నో ఆటంకాలను ఎదుర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నేతలు గిరికుమార్‌రెడ్డి, ప్రసన్న, శివతేజ, మహేష్‌రెడ్డి, ఉదయ్, సుధాకర్‌గౌడ్, బాలరాజు, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి రీసెట్ వద్దు

ప్రజాశక్తి - క్యాంపస్ :



రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పరిశోధక విద్యార్థుల ఎంపిక కోసం ఉమ్మడి రీసెట్ నిర్వహణను తిరస్కరించాలని తెలుగునాడు విద్యార్థి సమైఖ్య విన్నవించింది. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు రాగాల ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దళవాయి లోకనాధంలు ఎస్వీయూ వీసీ ఆచార్య ఆవుల దామోదరానికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశోధక విద్యార్థుల ప్రవేశానికి ఉమ్మడి పరీక్ష నిర్వహించడం వల్ల విశ్వవిద్యాలయాలు ప్రాధాన్యత కోల్పోతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నేతలు నాగార్జున, అభిలాష్, బ్రహ్మయ్య, రామాంజినేయులు పాల్గొన్నారు.

నోడల్ అధికారుల నియామకం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరీక్షల విభాగానికి నూతనంగా నోడల్ అధికారులను నియమించారు. ఈ మేరకు బుధవారం ఉపకులపతి ఆచార్య దామోదరం అధికారులకు ఉత్తర్వులను అందజేశారు. పరీక్షల విభాగాన్ని మరింత సమర్థవంతగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించి విభాగంలోని గోప్యత విషయాలను పరిశీలించనున్నారు. నోడల్ అధికారులుగా కామర్స్ విభాగానికి చెందిన ఆచార్య ఎం. వెంకటేశ్వర్లు, ఫిజిక్స్ విభాగానికి చెందిన ఆచార్య వై.సి.రత్నకరం, గ్రంథాలయాధికారి డాక్టర్ సురేంద్రబాబు, జియాలజి విభాగానికి చెందిన డాక్టర్ సత్యసాయిప్రసాద్, డాక్టర్ గోపినాయక్‌లను నియమించారు. ఈ సందర్భంగా నూతన నోడల్ అధికారులను రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.కె. అనురాధ అభినందించారు.



అధికారులకు ఉత్తర్వులను అందిస్తున్న ఆచార్య దామోదరం

బౌద్ధ మహా సమ్మేళనం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి నగరంలో రాష్ట్ర స్థాయి బౌద్ధ మహా సమ్మేళనాన్ని ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ కన్వీనర్ జి.గోవిందస్వామి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు పేరుతో నిర్వహిస్తున్న ఈ 8వ మహా సమ్మేళనంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మందిపైగా బౌద్ధ ధర్మ విశ్వాసకులు పాల్గొంటారన్నారు. 25 మంది బౌద్ధ బిక్షవులు, ఉపాసకులు, మేధావులు బౌద్ధ ధర్మానికి సంబంధించిన ఉపాన్యాసాలు చేస్తారని తెలిపారు. తనపల్లి రోడ్డులోని రామానాయుడు కళ్యాణ మండపంలో ఈ సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కమిటీ కో కన్వీనరు దినకర్ మూర్తి, సలహాదారు రిటైర్డు జడ్జీ గుర్రప్ప, సభ్యులు డాక్టరు దగ్గుమాటి శ్రీహరిరావు, ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

5న డయల్ యువర్ ఈవో

ప్రజాశక్తి-తిరుమల:

ప్రతినెలా మొదటి శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల మధ్య నిర్వహించే డయల్ యువర్ ఈవో కార్యక్రమం జనవరి 5వ తేదీన జరగనుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్‌తో ఫోన్ ద్వారా తమ సమస్యలు, ఫిర్యాదులు, సలహాలు మాట్లాడి తెలపవచ్చును. అందుకు భక్తులు సంప్రదించవలసిన నెంబరు 0877-2263261.

రైతు రథం'...'పసుపు' పథం..!

(మొదటిపేజీ తరువాయి)

తూర్పు మండలాల్లో రైతు రథం కింద ట్రాక్టర్లు పొందిన లబ్ధిదారుల జాబితాను ఒకసారి పరిశీలిద్దాం...

తొట్టంబేడు: తొట్టంబేడు మండలంలో 27 పంచాయతీలు ఉన్నాయి. మండలానికి మొదటి విడతలో ఏడు ట్రాక్టర్లు మాత్రమే మంజూరు చేయగా స్థానిక నేతల ఒత్తిళ్లతో ఆ సంఖ్యను 12కు పెంచారు. గుమ్మిడిగుంటకు చెందిన నిర్మల, చియ్యవరంకు చెందిన బాబు, పెద్దకన్నలికి చెందిన గంగాధర్, కొత్తకండ్రిగకు చెందిన రామచంద్రారెడ్డి, పూడికి చెందిన పురుషోత్తంనాయుడు, మునినాగమ్మ, పెద్దకన్నలికి చెందిన చిన్నమారయ్య, చిట్టత్తూరుకు చెందిన కల్పన, కంచనపల్లికి చెందిన గిరిబాబు, జ్ఞానాంబకండ్రిగకు చెందిన లక్ష్మణ్‌నాయుడు, బోనుపల్లికి చెందిన మహాలక్ష్మిలు మొదటి విడతలో ట్రాక్టర్లు పొందిన వారిలో ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం టీడీపీ అనుంగులు, 20 ఎకరాలకు పైబడిన భూస్వాములు ఉన్నారు. రామచంద్రారెడ్డి అనే వ్యక్తి కొత్తకండ్రిగ సర్పంచ్, భూస్వామి కావడం గమనార్హం. గిరిబాబు పక్కా ఎస్టీసెల్ టీడీపీ నేత. రెండో విడతలో ఏడుగురికి ట్రాక్టర్లు మంజూరయ్యాయి. వీరిలో బోనుపల్లికి చెందిన గజేంద్రనాయుడు, బత్తెయ్య, కాసరంకు చెందిన బాలాజీ, రత్నయ్యనాయుడు, లింగమనాయుడుపల్లికి చెందిన రాజేంద్ర, పెద్దకనపర్తికి చెందిన చలపతి, కారాకొల్లుకు చెందిన రామకృష్ణమనాయుడు ఉన్నారు. వీరిలో చలపతి పెద్దకనపర్తి సర్పంచ్, టీడీపీ నేత, మోతుబరి రైతు. బోనుపల్లికి చెందిన గజేంద్రనాయుడు టీడీపీనేత, మోతుబరి రైతు, అదే గ్రామానికి చెందిన బత్తెయ్య టీడీపీ నేత, డీలర్, కాసరం గ్రామానికి చెందిన బాలాజీ టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు, అదే గ్రామానికి చెందిన రత్నయ్యనాయుడు టీడీపీనాయకుడు, మోతుబరి రైతు. అదేవిధంగా కారాకొల్లు గ్రామానికి చెందిన రామకృష్ణమనాయుడు టీడీపీ సీనియర్ నాయకుడు, మోతుబరి రైతు కావడం గమనార్హం.

ఏర్పేడు: ఏర్పేడు మండలంలో మొదటి విడతలో ఎనిమిది ట్రాక్టర్లు మంజూరయ్యాయి. రెండో విడతలో పెద్దఅంజిమేడుకు చెందిన శివశంకర్‌రెడ్డి, కందాడుకు చెందిన అశ్వద్ధామ, శ్రీనివాసపురంకు చెందిన అమరలింగయ్య, చెల్లూరుకు చెందిన జయమ్మ, ఆమందూరుకు చెందిన ప్రకాష్, పరమాలపల్లికి చెందిన పోలయ్య, ముసలిపేడుకు చెందిన చెంచయ్యలు ఉన్నారు. వీరిలో శివశంకర్‌రెడ్డి ఏపీసీడ్స్ ఛైర్మన్ కావడం గమనార్హం. ప్రకాష్ యాదవ్ టీడీపీ యాదవ కార్పోరేషన్ నాయకుడు, ఆమందూరు సర్పంచ్ భర్త, జయమ్మ పేరు మీద ఓ టీడీపీ నేత ట్రాక్టరు తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా సబ్సిడీ రోటోవేటర్స్, వరికోతయంత్రం, జింక్ సల్ఫేట్, జిప్సమ్ ఎరువులను బినామీ పేర్లతో అధిక సబ్సిడీ మీద విక్రయించి కంపెనీ(ప్రకాష్ ఆగ్రో ఇండస్ట్రీస్) ప్రతినిధులతో వ్యవసాయాధికారులు వాటాలు పంచుకున్నారనే ఆరోపణలు ఉండటం గమనార్హం.

శ్రీకాళహస్తి రూరల్: శ్రీకాళహస్తి మండలం పరిధిలో 46 పంచాయతీలున్నాయి. మొదటి విడతలో ఎనిమిది ట్రాక్టరు మంజూరయ్యాయి. వీటిలో కొన్నింటిని టీడీపీ నేతలు బినామీ పేర్లతో సొంతం చేసుకోగా మరికొన్నింటిని మోతుబరి రైతులు సొంతం చేసుకున్నారు. రెండో విడతలో ఆరు ట్రాక్టర్లు మంజూరు కాగా వీటి పరిస్థితీ అంతే.

కెవీబీపురం: కేవీబీపురం మండలం పరిధిలో మొదటి విడతగా ఏడు ట్రాక్టర్లు మంజూరు కాగా అందరూ పార్టీ పెద్దలే కావడం గమనార్హం. వీరిలో రామాంజులునాయుడు తొట్టంబేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, మునస్వామి యాదవ్ టీడీపీ మండలాధ్యక్షుడు, కిషోర్‌రెడ్డి టీడీపీ మండల ఉపాధ్యక్షుడు, కిరణ్‌యాదవ్ వైస్ ఎంపీపీ, మణి మాజీ ఎంపీపీ కావడం గమనార్హం. రెండో విడతలో నాలుగు ట్రాక్టర్లు మంజూరు కాగా వాటిని కూడా టీడీపీ నేతలే సొంతం చేసుకున్నారు.

సత్యవేడు: మండలంలో మొదటి విడతలో పది ట్రాక్టర్లు మంజూరు కాగా పేరు మోసిన టీడీపీ నేతలు సొంతం చేసుకున్నారు. వీరిలో సుందరరామిరెడ్డి జెడ్పీ వైస్ ఛైర్మన్, పరమశివం టీడీపీ మండలాధ్యక్షుడు ఉండటం గమనార్హం. తక్కిన లబ్ధిదారులు కూడా టీడీపీ నేతలు, మోతుబరి రైతులే ఉన్నారు. రెండో విడతలో ఇద్దరు టీడీపీ నేతలకు ట్రాక్టర్లు మంజూరయ్యాయి.

వరదయ్యపాళెం: మండలంలో మొదటి విడతలో ఏడుగురికి ట్రాక్టర్లు పంపిణీ చేశారు. వీరిలో అంతా టీడీపీ నాయకులు ఉన్నారు. ఏ ఒక్క సన్నకారు రైతుకు ట్రాక్టర్ మంజూరు కాలేదు.

సంక్షేమంతో ప్రజలకు చేరువ


రామకుప్పం మండలంలో జన్మభూమి కార్యక్రమ దృశ్యం

ప్రజాశక్తి-రామకుప్పం గ్రామస్థాయిలో పేదలను గుర్తించి అర్హులైనవారందరికీ ప్రభుత్వ సంక్షేమఅభివృద్ధి కార్యక్రమాలు అందించాలనే ధ్యేయంతోనే ప్రభుత్వం జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మండల పరిధిలో బందార్లపల్లి గ్రామంలో బుధవారం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఇంకనూ అర్హులెవరైనా ఉండి ప్రభుత్వ పథకాలు అందనివారు అర్జీల రూపంలో అందజేస్తే ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో అంజనేయరెడ్డి, మునస్వామి, సిఐ రాజశేఖర్, చలపతి, చిన్నిక్రిష్ణ, తహశీల్దారు ఖాదర్‌షరీఫ్, ఎంపిడిఓ శివప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, కుద్దుసాబ్, బాలాజీనాయక్, బాబునాయక్, కామరాజునాయక్, ఆనందరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామక్రిష్ణప్ప, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వికోట

అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా బుధవారం జవ్వనపల్లి పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రజలవద్దకు పాలన తరహాలో ప్రభుత్వ యంత్రాంగాన్ని ప్రజల చెంతకు పంపి క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి జన్మభూమి కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యక్తిగత, గ్రామ సమస్యలను పరిష్కరించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న, సబ్‌కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి-2 చంద్రమౌళి, జిల్లా వైద్యాధికారి విజయగౌరి, డిఎస్పి చౌడేశ్వరి, ఎంపిపి సులోచనరంగనాథ్, తహశీల్దారు సుబ్రమణ్యం, ఎంపిడిఓ బాలాజీ, ఎఎంసి మాజీ ఛైసర్మన్ రామచంద్రనాయుడు, ఆర్‌వి బాలాజీ, జిల్లా పార్టీ అధ్యక్షులు నాని, జడ్‌పిటిసి నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

కుప్పం సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

ప్రజాశక్తి-శాంతిపురం

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును గమనించేందుకు కుప్పం వచ్చినట్లు రాష్ట్ర బిసివెల్ఫేర్ సంచాలకులు కె.హర్షవర్ధన్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని దండికుప్పం గ్రామపంచాయతీలో రెండోరోజు జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు అధ్యక్షతన దండికుప్పం, కొలమడుగు, శివరామపురం పంచాయతీలలో ఈ గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా దండికుప్పం గ్రామసభలో హర్షవర్ధన్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బిసి, కాపులకు రుణాలు మంజూరు చేస్తోందని తెలిపారు. ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధిపరంగా అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నారని, ప్రతి కుటుంబానికి నెలకు పదివేలు ఆదాయాన్ని చేకూర్చాలన్న ధ్యేయంతో సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేదప్రజలకు చంద్రన్న, సంక్రాంతి కానుకలను ఎంఎల్‌సి, బిసి సంక్షేమశాఖ సంచాలకులు హర్షవర్ధన్, స్థానిక సర్పంచి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సిడిసిఎంఎస్ ఛైర్మన్ నడింపల్లి శ్యామరాజు, టిడిపి మండల అధ్యక్షప్రధాన కార్యదర్శిలు ఇ.విజయరామిరెడ్డి, ఆర్‌ఎస్.మణి, ఎంపిపి పుష్ప, జడ్‌పిటిసి శకుంతల,తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి కార్యక్రమానికి జనం కరువు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కీలపల్లి,గంగ్రాజుపల్లి పంచాయితీలలో బుధవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో జనం పూర్తిగా లేకపోవటంతో అధికారులే ఈ కార్యక్రమాన్ని ముగించి వెళ్ళవలసిన దుస్థితి నెలకొంది.మండల యంపిపి క్రిష్ణమ్మ స్వగ్రామంఅయిన కీల్లపల్లి పంచాయితీ లో కూడా జనంలేక కార్యక్రమం బోసిపోయింది.అర్జీదారులు గతంలో అనేక సార్లు సమస్యలపై అర్జీలు ఇచ్చిన ప్రయోజనం లేకపోవటంతో ఇందుకు కారణమని పలువురు బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు.

సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి-పలమనేరు: పట్టణంలోని శ్రీవాణి, పద్మావతి మహిళా విద్యా సంస్థలలో బుధవారం సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకుని ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిసి నేత పూసల రవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ సావిత్రిబాయి దేశంలోనే తొలి మహిళా టీచర్‌గా పనిచేశారని ప్రతి మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతం మహిళా లోకానికి ఆమె చేసిన సేవలను గురించి విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సగినేకుప్పం రోడ్డుకు మహర్దశ

ప్రజాశక్తి-రామకుప్పం రామకుప్పం సమీపంలోని సగినేకుప్పం రోడ్డుకు ఎట్టకేలకు మహర్ధశ లభించింది. సగినేకుప్పం మీదుగా సాకలకుప్పం క్రాసు వరకు బిటిరోడ్డు ఏర్పాటు చేస్తున్నందుకు గాను రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. దీంతో బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు అట్టహాసంగా భూమిపూజ కార్యక్రమాలతో పనులు ప్రారంభించారు. ఏళ్ల తరబడి ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోకపోగా ఇన్నాళ్ళకు తారురోడ్డు మంజూరు కావడంపై స్థానికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవంలో టిడిపి మండల కన్వీనర్ అంజనేయరెడ్డి, జడ్‌పిటిసి మునస్వామి, కుప్పం సిఐ రాజశేఖర్, తహశీల్దారు ఖాదర్‌షరీఫ్, ఎంపిడిఓ శివప్రసాద్, చిన్నిక్రిష్ణ, చలపతి, పత్రనారాయణ, ఉబేదుల్లా, ఎస్ఐ సురేష్‌బాబు, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

బిటిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ

శాంతిపురం: మండల పరిధి శివరామపురం పంచాయతీలో ఒడ్డువంక గ్రామంలో బిటిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు పూజ చేసి ప్రారంభించారు. సుమారు 90 లక్షల వ్యయంతో 1.8కిలోమీటర్ల మేర ఈ తారురోడ్డును నిర్మించనున్నారు. ఈ పూజా కార్యక్రమంలో సర్పంచి యశోదభాస్కర్, నర్సరి శేఖర్, సింగిల్‌విండో సభ్యులు ఆనందరెడ్డి, ఎంపిపి పుష్ప, జడ్‌పిటిసి శకుంతలా శ్రీనివాస్, సిడిసిఎంఎస్ నడింపల్లి శ్యామరాజు, ప్రకాష్, బి.చలపతి, దాము తదితరులు పాల్గొన్నారు.

నగరి ఎస్ఐగా మునస్వామి

నగరి, ప్రజాశక్తి : నగరి ఎస్ఐగా మునస్వామి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరు టూటౌన్ ఎస్‌గా పని చేస్తూ బదిలీ పై నగరికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ విక్రమ్ గుడిమల్లంకు బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా భాధ్యత స్వీకరించిన ఎస్ఐ మునస్వామి మాట్లాడుతూ నగరిలో నేర నియంత్రణకు తమ వంతు కృషి చేస్తామని, నగరిలో శాంతి భద్రతా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజలు ఎటువంటి సమస్యలు వున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

జన్మభూమిలో అధికారులను నిలదీసిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పలమనేరు:


అర్జీ ఇస్తున్న ఓబులరాజు, గిరిధర్‌గుప్తా

ఐదవ విడత జన్మభూమి -మాఊరు కార్యక్రమంలో రెండు రోజు మున్సిపాలిటీ పరిధిలోని 7 వ వార్డులో కౌన్సిలర్ వాణి ఆద్వర్యంలో స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం ముందర కార్యక్రమం జరిగింది.ఈ సమావేశంలో వైస్‌చైర్మెన్ చాంద్‌భాష, కమీషనర్ రామచంద్రరావు పాల్గొన్నారు. చంద్రన్నకానుకలను,రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.ప్రభుత్వం పథకాలను ఏకరవు పెడుతూ అన్ని శాఖల అధికారులచే మాట్లాడించే ప్రయత్నం చేస్తున్నారే తప్ప ప్రజల సమస్యలను,అభిప్రాయాలను అడిగి తెలుసుకునే వారే కరువయ్యారని ప్రస్ఫుటంగా జన్మభూమిలో కన్పిస్తుంది.ఇది గమనించిన సిపియం జిల్లాకార్యదర్శివర్గసభ్యులు ఓబులరాజు,పట్టణఅద్యక్షులు గిరిధర్‌గుప్తా ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులను నిలదీశారు.ఈ కార్యక్రమంలో జన్మభూమి కమిటీ సభ్యులు బిఆర్‌సికుమార్,నౌజియా,లావణ్య,జయకిషోర్,రెడ్డిప్రసాద్ తో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు వైద్యఆరోగ్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయండి

పలమనేరు వైసిపి నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-పలమనేరు:

నియోజక పరిధిలో గత నాలుగు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధి, పెండింగ్ లో వున్న సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల పనులపై తెలుగుదేశం ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని వైసిపి నియోజకవర్గ నాయకులు రాకేష్‌రెడ్డి, సివి కుమార్, మొగసాల రెడ్డెమ్మ, వెంకటేగౌడ, ఆకులగజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలో గంగనశిరస్సు, కైగల్ జలపాతాల అభివృద్ధిని తుంగలో తొక్కిందని విమర్శించారు. హంద్రీనీవా ప్రాజెక్టు పనులను అర్ధాంతరంగా నిలుపదల చేసి ప్రజలను నట్టేట ముంచిన ఘనత చంద్రబాబుకే చెల్లిందన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాయలసీమ ప్రాంతాలలోని రైతులకు సాగునీరు అందించే సద్దుద్దేశంతో హంద్రీనీవా ప్రాజెక్టును తీసుకొస్తే అనంతరం జిల్లా వరకు వచ్చిన కాలువ పనులను టిడిపి ప్రభుత్వం విస్మరించిందని దుయ్యబట్టారు.ఈ పనులు చేపట్టాలంటే జగన్ పాలనలోనే సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణఅద్యక్షులు మండీసుధా,నాయకులు చెంగారెడ్డి,మొగసాలక్రిష్ణమూర్తి,కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-రామకుప్పం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 9వ తేదీన చిత్తూరు జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో కుప్పం నియోజకవర్గ పరిధిలోని రామకుప్పం మండలం ననియాల ఎలెఫెంట్‌క్యాంప్ వద్ద ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, ఎస్‌పి రాజశేఖర్‌బాబు, డిఎఫ్‌ఒ చక్రపాణితో కలిసి పరిశీలించారు. ఇక్కడ జరిగే జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఫారెస్టు గెస్ట్‌హౌస్ సమీపంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగడానికి, సభావేదిక, ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, శంకుస్థాపనలు, ననియాల ఎలెఫెంట్ క్యాంపు, టూరిజంప్రాజెక్టు ప్రారంభోత్సవాల శిలాఫలకాల ఆవిష్కరణ అనువైన స్థలాలను ఇక్కడ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో సిఎం పిఎ మనోహర్, రెస్కో ఛైర్మన్ మునిరత్నం, ఎస్‌బిబిఎస్‌పి రామ్‌కుమార్, పలమనేరు డిఎస్‌పి చౌడేశ్వరి, జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసురెడ్డి, కుప్పం సిఎ రాజశేఖర్, టిడిపి మండల కన్వీనర్ అంజనేయరెడ్డి, జడ్‌పిటిసి మునస్వామి, స్థానికాధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలోని చట్టకారుమిట్ట దళిత కాలనీ రోడ్డు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బుధవారం జన్మభూమి అధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టణ కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ చట్టకారు మిట్టలో వందేళ్లుగా 40 దళిత కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. అయితే ఓ మహిళ ఆ దారిని ఆక్రమించి కట్టడాలు ప్రారంభించిందని చెప్పారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్‌శాఖలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. దీంతో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శ్రమదానం చేసి రోడ్డు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటికైనా దారి దురాక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేవీపీఎస్ కమిటీ సభ్యులు అనురాధ, వెలివేంద్రం, మరియమ్మ, మేరి, మేఘాలా, రాజశేఖర్, గోపి, గోపీనాథ్, ధనలక్ష్మి, భారతి, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలిచ్చి ఆదుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జిల్లాలోని యానాదులను విరివిగా రుణాలిచ్చి ఆదుకోవాలని ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందమామల కోటయ్య జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్నను కోరారు. బుధవారం ఆయన చిత్తూరు కలెక్టరేట్‌లో యానాదుల సమస్యలతో కూడిన వినతిని కలెక్టర్‌కు అందజేశారు. ప్రభుత్వం యానాదులకు రుణసదుపాయం కల్పిస్తున్నా బ్యాంకుల నుంచి సరైన సహకారం అందడం లేదని వాపోయారు. వారి ఆర్థిక స్థితిగతులను సాకుగా చూపుతా రుణాలు ఇవ్వలేమని తిప్పి పంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకులతో చర్చించి రుణ సదుపాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

27వ వార్డుపై ఎందుకంత ప్రేమ!

జన్మభూమిలో వైసీపీ నిలదీత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలో 27వ వార్డుపై ఎందుకంత ప్రేమని వైసీపీ మున్సిపల్ లీడర్ మిద్దెల హరి ప్రశ్నించారు. ఎస్టీ వార్డుల అభివృద్ధి కేటాయించిన నిధులను దారి మళ్లించి 27వ వార్డుకే కేటాయించడంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ హస్తం ఉందని ఆరోపించారు. ఐదో విడత జన్మభూమి కార్యక్రమంలో బుధవారం పట్టణంలోని 6వ వార్డు గజేంద్ర నగర్‌లో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వైసీపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. స్థానిక వైసీపీ కౌన్సిలర్ సభను ప్రారంభించగా మిద్దెల హరి ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల భాగోతంపై ధ్వజమెత్తారు. మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దత్తతవార్డులు కుందేటివారి వీధి, లంకమిట్ట అభివృద్ధికి రూ.83 లక్షలు కేటాయిస్తే ఆ నిధులను రద్దు చేసి 27వ వార్డుకు కేటాయించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. 6వ వార్డులోని ఎస్టీ కౌన్సిలర్‌ను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లు పూర్తయినా ఒక్క రేషన్‌కార్డు కానీ, పెన్షన్ కానీ, ఇల్లు కానీ మంజూరు కాలేదని ప్రశ్నించడంతో మాజీ శాఫ్ ఛైర్మన్ వాగ్వాదానికి దిగారు. దీంతో కాస్త ఉద్రిక్తత నెలకొంది. ఇప్పటికైనా ఎస్టీ వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కమిషనర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తి క్యాలెండర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి ప్రజాశక్తి న్యూ ఇయర్ క్యాలెండర్లను ప్రముఖ జమాలజిస్టు, బీజేపీనేత తులసీనెహ్రూ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రతినిత్యం ప్రజా సమస్యలను ఆవిష్కరించడంలో ముందుంటోందన్నారు. పత్రిక మరెన్నో వార్షికోత్సవాలు జరుపుకోవాలనీ, మరిన్ని క్యాలెండర్లు ఆవిష్కరించాలని ఆకాంక్షించారు. డివిజన్ ఇన్‌ఛార్జి కిషోర్, రాజశేఖర్ పాల్గొన్నారు.


ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తులసీనెహ్రూ

అంధులంటే అలుసా..?

ఒక్క నిమిషం కూడా చీకటిలో ఉండటానికి ఇష్టపడకుండా వెలుగు కోసం టార్చ్‌లైట్‌ను వెతుకుతాం. మరి..! జీవితాంతం కనిపించమని ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ కలివిడిగా బతికే అంధుల పరిస్థితి ఎలా ఉండాలి..సమాజం నుంచి ఎదురయ్యే చీదరింపులు, అవమానాలు, కష్టాల కడలిలో కూడా ఆటుపోట్లను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్న వారికి కొండంత భరోసా ఇవ్వాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది. నేడు బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా అంధుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ రోజైనా కొంత సమయం వెచ్చించి వారి పరిస్థితిని, వారి సమస్యలను తెలుసుకుందాం. ఆ సమస్యల పరిష్కార దిశగా అధికారులను, నాయకులను ప్రశ్నిద్దాం.

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతిలో అంధుల శరణాలయాన్ని 1980లో స్థాపించారు. పడమర రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న వెస్ట్ చర్చ్ కాంపౌండ్‌లో 70 మందికి వసతి కల్పించేలా దీన్ని ప్రారంభించారు. చిత్తూరు, కడప, ఒంగోలు, అనంతపురం, నెల్లూరు జిల్లాలకు చెందిన వారు ఈ హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ ప్రభుత్వ వసతి గృహాన్ని శివజ్యోతినగర్‌లోని ఓ ప్రభుత్వ స్థలంలోకి 1991లో మార్పు చేశారు. 1993లో ప్రభుత్వ నిధులతో ఐదు గదులను నిర్మించి చేతులు దులుపుకున్నారు. ఒక్కో గదిలో సుమారు 12 మందికిపైగా అంధులు ఇరుక్కొని మరీ పడుకునేవారు. చుట్టుపక్కల ప్రహరీ లేదు. ఎక్కడ చూసినా చెత్తా చెదారమే. పాములు, విషపురుగులతో కలిసి జీవించేవారు. దీనిపై మీడియా స్పందించడంతో పాలకుల్లో కొంత కదలిక వచ్చింది. మరో ఐదు అదనపు గదులను నిర్మించి 1997 జనవరి 4వ తేది అప్పటి తిరుపతి ఎంఎల్‌ఎ ఎ.మోహన్, జిల్లా కలెక్టరు నరసింగరావులు వాటిని ప్రారంభించారు. అవి కూడా చాలకపోవడంతో అప్పటి నుంచి ప్రభుత్వాన్ని ప్రాధేయపడితే ఎలాగోలా 2009లో అదనపు బిల్డింగ్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. తుడా నిధుల నుంచి రూ.15 లక్షలు విడుదల చేశారు. ఆ నిధులు చాలకపోవడంతో జిల్లా పరిషత్ నిధుల నుంచి మరో రూ.7 లక్షలు మంజూరు చేసి ఎలాగోలా 2010లో కొత్త భవనాన్ని ప్రారంభించారు. చుట్టుపక్కల ప్రహరీని నిర్మించి, హాస్టల్ చుట్టూ గ్రావెల్ మట్టితోలి నాణ్యత లేకుండా అలా సరిపెట్టేశారు.

అంధులకు భరోసా నిల్..!


నాసిరకం తలుపులు

పుట్టుకతోనే గుడ్డివారిగా ఉంటూ చుట్టుపక్కల వారు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు సక్రమంగా పట్టించుకోక, చీత్కారాలను ఎదుర్కొంటూ అనేక ఇబ్బందులను అనుభవిస్తూ కూడా బతుకుపై ఆశతో జీవిస్తున్న అంధులకు భరోసా ఇవ్వడంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. కళ్లు కనిపించకున్నా సాధారణ వ్యక్తులకు పోటీగా చదువుల్లో రాణించి, ఉన్నత విద్యనభ్యసించినా అంధులకు ఉపాధి లభించకపోవడం దుర్మార్గం. అంధుల రిజర్వేషన్ ప్రకారం కూడా వారికి ఉద్యోగులు కల్పించకపోవడంతో తాము ఎలా బతకాలనే ఆందోళనలో అంధులు కొట్టుమిట్టాడుతున్నారు. తిరుపతి కేంద్రంగా ఉన్న టిటిడిలోనే ఆరువేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయడం లేదు. అంధుల కోటాను సైతం పట్టించుకోవడం లేదు. టిటిడిలో కనీసం తమకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాన్నైనా ఇచ్చి ఆదుకోవాలని పలువురు అంధులు వేడుకుంటున్నారు. అంధుల అభివృద్ధికై ప్రభుత్వం చట్ట సభల్లో ఊకదంపుడు ప్రసంగాలు చేసి, వారికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటోంది. ప్రతి ఏడాది బడ్జెట్‌లో రూ.100 కోట్ల కేటాయిస్తోంది. 2016వ సంవత్సరంలో మంజూరు చేసిన నిధుల్లో రూ.60 కోట్లకుపైగా మురిగిపోయాయి. వాటిని సక్రమమైన మార్గంలో ఖర్చు చేసి, అంధుల అభివృద్ధికి ఎందుకు ఉపయోగించరో పాలకులే చెప్పాలి..?.

ఆరేళ్లకే ఉరుస్తున్న నూతన భవనం

సుమారు రూ.23 లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు గదులు ఉన్న భవనం ఆరేళ్లు కూడా కాకముందే చిన్నపాటి వర్షానికి సైతం ఉరుస్తోంది. 12 గదులతో రెండు అంతస్తులను నిర్మించారు. అయినా ఈ భవనంలోని మొదటి అంతస్తులో చిన్నపాటి వర్షం వచ్చినా గదుల్లోకి నీటి ప్రవాహం ఆగక మానదు. డోర్లను సైతం నాణ్యత లేనివి ఏర్పాటు చేశారు. వీటిని చూస్తే పాత తలుపులకు కొత్తగా పెయింట్ కొట్టించి పెట్టారా అనే అనుమానం ఎదురవుతోంది. తలుపులు ఏర్పాటు చేసిన ఏడాది కూడా గడవక ముందే చెదులుపట్టి, పిప్పి తినేశాయి. అంధులే కదా వారు చూడరులే అనుకున్నారేమో, కాంట్రాక్టర్లు, అధికారులు నాణ్యతను గాలికొదిలేసి తూతూ మంత్రంగా భవన నిర్మాణాన్ని కానిచ్చేశారు. ఎలక్ట్రికల్ పనులు సైతం నాసిరకంగా చేశారు. వైరింగ్ మొత్తం లూజు కనెక్షన్లు, తిరగని ఫ్యాన్లు, వెలగుని లైట్లతో అంధుల అవస్థలు వర్ణణాతీతం. అంధులకు ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, బాత్‌రూములు శిథిలావస్థకు చేరుకున్నాయి. కనీసం మరుగుదొడ్లకు తలుపులు కూడా పెట్టకుండా వదిలేశారు. హాస్టల్ పక్కనే డ్రెయినేజీ కాలువ ప్రవహిస్తుండడంతో పగలూ రాత్రి అని తేడా లేకుండా నిత్యం దోమలతో యుద్ధం తప్పడం లేదు. దోమల కాటుకు గురై అనేక మంది అంధులు ఇటీవల కాలంలో జ్వరాల బారిన పడ్డారు. అయినా పాలకుల్లో కనికరం లేదు. అంధులు ఎదుర్కొంటున్న సమస్యలు తిరుపతి అంధ శరణాలయంలోని వారి మాటల్లోనే విందాం...


పెచ్చులూడిపోయిన కొత్త భవనం


తలుపుల్లేని బాత్రూములు

అన్ని అవయవాలు సక్రమంగా పని చేస్తూ ప్రభుత్వ తీరును ఎండగడుతున్న వారంటేనే లెక్కలేని పాలకులకు అంధులంటే మరీ అలుసుగా తయారయింది. గుడ్డివారు కదా తాము ఏమి చేసిన పట్టించుకోరనే మీమాంస ఎక్కువయింది. కనీసం వారికి మౌళిక వతసలు కల్పించేందుకు కూడా పూనుకోలేదు. ఏదోలా నూతన భవనాన్ని నిర్మించిన ఆరేళ్లకే ఉరుస్తుందంటే నాణ్యత ఏమాత్రమో అర్థమవుతుంది. అంధులైన ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులగానే మిగిలిపోయారు. ప్రభుత్వం నుంచి భరోసా లేకపోవడంలో ఆయోమయ స్థితిలో ఊగిసులాడుతుండడం గమనార్హం. జనవరి 4న అంధుల దినోత్సవం సందర్భంగా 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం..!

నేడు ప్రపంచ అంధుల దినోత్సవం

- శరణాలయంలో మౌలిక వసతులు కరువు
- ఆరేళ్లకే ఉరుస్తున్న కొత్త బిల్డింగ్
- పట్టించుకోని పాలకులు, అధికారులు

బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ఎంతో మంది అంధులకు ఆరాధ్య దైవమైన బ్రెయిలీ జన్మదినోత్సవాన్ని ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలి. ప్రతి ఏడాది దాతల సహకారంతో తిరుపతి అంధుల శరణాలయంలో వేడుకలు నిర్వహిస్తున్నాం. వేడుకలకు కనీసం లక్ష రూపాయల వరకు వ్యయమవుతుంది. అందులో జిల్లా అధికారులు రూ.15 వేలు మంజూరు చేసి చేతులెత్తేస్తున్నారు. వేడుకలకు ఎంతయిందో బిల్లులు పెట్టి డబ్బులు తీసుకోండి అంటూ అధికారులు ఉచిత సలహా ఇస్తున్నారు. అంధులమైన తాము ఎక్కడ నుంచి తీసుకొచ్చి వేడుకలుచేస్తాం. బ్రెయిలీ జన్మదినోత్సవ వేడుకలను ప్రభుత్వమే నిర్వహించాలి.

-పి.చిట్టిబాబురెడ్డి, నారాయణరెడ్డిపల్లి, పూతలపట్టు.

దోమల బెడద తట్టుకోలేకపోతున్నాం



అంధుల హాస్టల్‌కు సమీపంలోని కపిలతీర్థం నుంచి వినాయకసాగర్‌కు ప్రవహించే పెద్ద కాలువ ఉంది. చుట్టుపక్కల వారు ఆ కాలువను డ్రెయినేజీకి వాడుకోవడంతో దోమలు అధికంగా ఉన్నాయి. రాత్రి, పగలు అని తేడా లేకుండా నిత్యం దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కనీసం ఫాగింగ్‌గైనా చేయాలని కార్పొరేషన్ అధికారులను కోరాం. హాస్టల్ పక్కన డ్రెయినేజీ కాలువ ఉండడంతో దోమలను అరికట్టలేము, ప్రతి ఒక్కరూ మస్కట్ బ్యాట్ కొనుక్కోండంటూ ఉచిత సలహా ఇచ్చారు. కనీసం వారానికి ఒక్క సారైనా ఫాగింగ్ చేస్తే కొంతవరకైనా దోమల బెడద అరికట్టవచ్చు.

-బి.సుధాకర్, పెద్దమండ్యం, చిత్తూరు జిల్లా.

చేస్తామన్న చదలవాడ జారుకున్నారు



అంధుల అనాథశరణాలయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని టిటిడి చైర్మన్‌గా చదలవాడ కృష్ణమూర్తి ఉన్నప్పుడు రెండు సంవత్సరాలు తమ శరణాలయంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా ఆహ్వానించాం. వేడుకలకు వచ్చిన ప్రతిసారీ చదలవాడ ఇక్కడ సమస్య లు చూసి చలించిపోయారే తప్పాచేసిందేమి లేదు. అదిగో ఇదిగో అంటూనే రెండు సంవత్సరాలు కానిస్తూ పదవీ కాలం పూర్తి చేసుకుని వెళ్లిపోయారు. అంధుల వల్ల తమకేంటి లాభమనుకున్నారేమో.

-ఎల్.బాలాజీ, చిత్తూరు సమీపంలోని రామాపురం.

ఐదడుగుల దారిలో రాకపోకలు



అంధుల శరణాలయానికి వచ్చే దారి రాను రాను ఐదు అడుగులకు కుచించుకుపోయింది. హాస్టల్‌లో ఉన్న అంధులు రాకపోకలు సాగించాలంటే ఇద్దరు ముగ్గురు కలిసి ఒకటిగా చేతులు పట్టుకుని వెళ్లాలి. ఐదు అడుగుల దారిలో అది కష్టంగా ఉంది. పైగా ఇదే దారిలో నిత్యం ద్విచక్రవాహనదారులు రయ్..రయ్..మంటూ తిరుగుతుంటారు. వేగంగా వాహనాలు నడపడం వల్ల హాస్టల్ బయటకు రావాలంటే భయమేస్తుంది. ద్విచక్ర వాహనాల రాకపోకలను ఆ దారిలో నిలవరించేందుకు ప్రయత్నించాలని అధికారులకు గతంలో అనేక సార్లు విన్నవించాం. ఆ దారిలో అనేక మంది కాపురాలు ఉన్నారు. వారి ఇళ్లకు వారు వెళ్లాలి కదా అంటూ, పది రోజుల క్రితం హాస్టల్‌కు అటుపక్క ఇటుపక్క అరడుగు ఎత్తులో రెండు స్పీడు బ్రేకర్లు వేసి చేతులు దులుపుకున్నారు.

-బి.శివాజీ, యాదమరి, చిత్తూరు జిల్లా.

కొత్త బిల్డింగ్‌లోనూ నీళ్లు కారుతున్నాయి



ఇరుకుగదుల్లో ఉండలేమని అనేకసార్లు ప్రభుత్వాన్ని వేడుకుంటే, మీడియా చొరవతో ఎలాగోలా ప్రభుత్వం అదనపు గదుల నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. సుమారు రూ.23 లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ఐదు సంవత్సరాలు కూడా తిరుగకుండానే చిన్నపాటి చినుకులకే ఉరుస్తోంది. వర్షం వస్తే మొదటి అంతస్తు మొత్తం నీటిమయమవుతోంది. గోడలు సైతం నెరలుబారిపోయాయి. నాసిరకం తలుపులు, కిటికీలు వేయడంతో ఏడాది తిరగకనే అవి పాడైపోయాయి. తలుపులన్నీ ఊడిపోయి, పగిలిపోయాయి. వైరింగ్ కూడా సక్రమంగా చేయకపోవడంతో స్విచ్‌బోర్డుల వద్ద కనెక్షన్లు సక్రమంగా లేవు.

-ఎన్.వెంకటరమణ, కడప జిల్లా కొత్తూరు.

ఉపాధి కల్పించండి



అంధులు కావడంతో మాపై అందరూ చులకన భావం చూపుతున్నారు. కుటుంబ సభ్యులకు భారం కాకూడదనుకునే మేము హాస్టల్‌లో ఉంటున్నాం. ఒకరిపై ఆధారపడకుండా మా జీవన పోషణను మేమే సంపాదించుకోవాలనే తపనతో బ్రెయిలీ రూపొందించిన అంధులు లిపిని ఉపయోగించుకుని చదువుల్లో రాణిస్తున్నాం. అనేక మంది బిఏలు, బికాంలు, ఇతరత్ర డిగ్రీలు, ప్రత్యేక నైపుణ్యత గల కోర్సులను పూర్తి చేశారు. లైబ్రేరియన్, లిటరేచర్ తదితర శిక్షణలో ఆరితేరారు. నైపుణ్యత సాధించడంలో మా శక్తి మేరకు కృషి చేస్తూ, పట్టభద్రులుగా నిలిచాం. కానీ మాకు ఉపాధి కల్పిండంలో ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం, మా చదువులకు తగ్గ ఉద్యోగాలు రిజర్వేషన్ ప్రకారం మాకు ఇవ్వాలి. రెగ్యులర్ ఉద్యోగాలు లేకపోయినా కనీసం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలైనా ఇచ్చి ఆదుకోవాలి.

-పి.బాస్కర్, వసంతరాయలపల్లి, మొలకల చెరువు.

సమస్యలకు నిలయంగా రైతు బజారు



దళారులతో తప్పని ఇక్కట్లు

ద్విచక్రవాహనాల పార్కింగ్‌తో అవస్థలు

పట్టించుకోని మార్కెటింగ్ శాఖ అధికారులు

బిక్కుబిక్కుమంటున్న రైతులు

ప్రజాశక్తి-తిరుపతి రూరల్

తిరుపతిలోని రైతు బజారు ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తోంది. అధికారుల అనాలోచిత నిర్ణయాలు రైతులు, చిరు వ్యాపారుల పట్ల శాపంగా మారాయి. దళారుల మాయమాటలకు తక్కువ రేటుకే రైతులు తమ కూరగాయలను అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. సమస్యలకు నిలయంగా మారిన రైతు బజారుపై ప్రజాశక్తి కథనం..

రైతు బజారు అనేది అన్నదాతలు తాము పండించిన పంటలు స్వయంగా అమ్ముకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆశయం మంచిదే అయినా తిరుపతిలోని రైతు బజారు వల్ల రైతులకు ఎంత వరకు ప్రయోజనం చేకూరుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం ప్రజలంతా సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలపై మక్కువ చూపడంతో పల్లెల నుంచి వచ్చే కూరగాయలకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో పల్లె ప్రాంత రైతన్నలు తాము పండించిన కూరగాయలను తిరుపతి నగరంలోని రైతు బజారుకు తీసుకొచ్చి స్వయంగా అమ్ముకుని సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా తిరుపతిలోని రైతు బజారుకు రైతులు తాము పండించిన కూరగాయలను అమ్ముకోవడానికి క్యూ కడుతున్నారు. రైతు బజారు ప్రాంగణంలో వారికి వెసులుబాటు కల్పించకపోవడంతో రైతు బజారు వెలుపలనే ఫుత్‌పాత్‌లపైన అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కొంత మంది రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు. రైతులు తమ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో తెలియక తికమక పడుతున్నారు. అంతేకాక రైతు బజారు నియమ నిబంధనలపై అవగాహన లేక చాలా మంది రైతులు నష్టపోతున్నారు.

దళారులతో వేగలేకున్నాం

రైతు బజారుకు ఉదయాన్నే 6 గంటలకు రైతులు తమ కూరగాయలను తీసుకొస్తారు. అయితే వారిని అమ్ముకోవడానికి దళారులు అడ్డుపడతారు. రైతులు చెప్పే రేటుకంటే తక్కువ ధరకు మాయమాటలు చెప్పి కొనుక్కుంటారు. ఆ దళారుల మాటలకు మోసపోయి రైతులు వారు తెచ్చిన కూరగాయలను తక్కువ రేటుకే అమ్ముకుంటారు. ఆ తర్వాత దళారులు రోజంతా అక్కడే ఉండి ఎక్కువ రేటుకు వినియోగదారులకు విక్రయించుకుంటారు. దీంతో తాము కష్టపడి పండించిన కూరగాయలను అమ్ముకోవడానికి రైతులు నానా కష్టాలు పడుతున్నారు. తమకు రావాల్సిన ఆదాయాన్ని దళారులు చేజిక్కించుకోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధని ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు తికమక పడుతున్నారు. గతంలో ఈ సమస్యను మార్కెటింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇకనైనా సంబంధిత అధికారులు దళారుల నుంచి రైతులను కాపాడాలని వారు కోరతున్నారు.

ట్రాఫిక్ సమస్యతో వెగలేకున్నాం



నిత్యం రద్దీగా ఉండే రైతు బజారు ముందు భాగంలో ద్విచక్రవాహనాలు నిలపడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకుంటోంది. రైతు బజారుకు పార్కింగ్ ప్రదేశాన్ని ప్రభుత్వం చూపిస్తే బాగుంటుంది. అధికారులకు ఈ సమస్యపై చాలా సార్లు విన్నవించుకున్నాం. చర్యలు తీసుకుంటామంటున్నారు కానీ ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడం లేదు.

-గుర్రమ్మ, పండ్ల వ్యాపారి

దళారులతోనే బెడద



రైతులు పండించే కూరగాయలను రైతు బజారులో అమ్మనీయకుండా కొంత మంది దళారులు వచ్చి అడ్డుకుంటున్నారు. మేము పండించిన కూరగాయలను తక్కువ రేటుకు కొని వారు అక్కడే ఉండి ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నారు. దీంతో మా కష్టం మాకు దక్కడం లేదు. ఎవరికి చెప్పుకోవాలో దిక్కుతోచక తికమక పడుతున్నాం. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి దళారులను కట్టడి చేయాలి.

-సుబ్బరత్నమ్మ, రైతు, తాటిమాకుల కండ్రిగ

కనీస సదుపాయాలు నిల్..!

నగరంలో ఏర్పాటు చేసిన రైతు బజారులో మౌలిక సదుపాయాలు లేక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. వారి నుంచి సుంఖం వసూలు చేసే రైతు బజారు అధికారులు కనీస సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తుంది. ఫలితంగా ప్రభుత్వ ఆశయం నీరుగారిపోతోంది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తిరుపతిలోని రైతు బజారులో నెలకొన్న సమస్యలతో పాటు అన్నదాతలకు ప్రత్యామ్నాయం చూపాలని, వ్యాపారుల సమస్యలను పరిష్కరించి, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని నగరవాసులు కోరుకుంటున్నారు. ప్రభుత్వం ఉన్నత ఆశయంతో తీసుకొచ్చే సంస్కరణలు ఇలా అధికారుల అలసత్వంతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయి. నిధుల దుర్వినియోగం తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు. దీంతో విమర్శలు మూడగట్టుకోవాల్సిన పరిస్థితి నెలకుంటోంది. ఇకనైనా అటు ప్రభుత్వం, ఇటు అధికారులు స్పందించి ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరుతున్నారు. రైతుల కోసం ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సృష్టించిన వ్యవస్థ ఆయన కళ్ల ముందే ఈ పాలకులు నీర్వీర్యం చేస్తూ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు.



ప్రజాశక్తి
www.prajasakti.com
చిత్తూరు
గురువారం 4 జనవరి 2018


ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన


ఫోటోల ప్రదర్శనను తిలకిస్తున్న ఫోటోగ్రాఫర్లు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

దీనా కలర్‌ల్యాబ్ చెన్నై ఆధ్వర్యంలో స్థానిక ఎల్‌జిబి టవర్స్‌లో బుధవారం నిర్వహించిన ఫోటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. నూతన టెక్నాలజీతో ఫోటోలను అందంగా ఎలా తీసుకురావాలో ఫోటోగ్రాఫర్లకు నిర్వాహకులు వివరించారు. సరికొత్త యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకొనే విధానంతో పాటు నేటి పరిస్థితులకు అనుగుణంగా ఫోటోగ్రఫీలో వచ్చిన మార్పులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు, ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

శ్రీరంగం శ్రీనివాసరావు చిత్రం



కలికిరి: బడుగు బలహీన శ్రామిక వర్గ విప్లవ రచయిత మహాప్రస్థానం గ్రంథకర్త అయిన మహాకవి శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) జయంతి పురస్కరించుకొని సైనిక్ స్కూల్ ఆర్ట్ టీచర్ శ్రీరాములు నీటి రంగులతో ఆయన చిత్రాన్ని చిత్రీకరించారు.

మొక్కలు నాటడమే ధ్యేయం

కోటీ 60 లక్షల మొక్కలే లక్ష్యం

డిఎఫ్‌ఒ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

సోషల్ ఫారెస్టు ద్వారా 2018లో కోటి 60 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు డిఎఫ్‌ఒ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక ఫారెస్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది వివిధ రకాల కార్యక్రమాలతో జిల్లాలో మొక్కల పెంపకం చేపట్టామన్నారు. అలాగే ఈ ఏడాదిలో కూడా ప్రతి గ్రామంలో పల్లె వనాలను ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి పల్లె వనాన్ని జిల్లాలోని మొగరాల పంచాయతీల్లో ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాదిలో కొత్తగా కొబ్బరి మొక్కలను అందుబాటులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ పుట్టిన రోజును పురస్కరించుకొని మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు.

ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-యాదమరి

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని 1984 పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మారెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేను ప్రతి మహిళా ఉపాధ్యాయురాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శివప్రసాద్, అమరనాథరెడ్డి, భాస్కర్‌రావు, మదన్‌మోహన్, హెచ్‌ఎం రూపేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర విజయవంతం చేయండి

ఎంఎల్‌ఎ సునీల్‌కుమార్

ప్రజాశక్తి-తవణంపల్లి

వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న ప్రజాసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని పూతలపట్టు నియోజకవర్గ ఎంఎల్‌ఎ సునీల్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 8, 9వ తేదీల్లో పూతలపట్టు నియోజకవర్గంలో జగన్ సంకల్పయాత్ర ఉంటుందని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పట్నం ప్రతాప్‌రెడ్డి, నాయకులు గాంధీబాబు, ఉమామహేశ్వరరెడ్డి, రమణారెడ్డి, రవిరెడ్డి, దేవరాజులు, చిట్టిబాబు, వరప్రసాద్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: జగన్ పాదయాత్రను జయప్రదం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ వెంకట బ్రహ్మానందరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని సికెపల్లి పంచాయతీలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆ పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలందరూ పట్టుదలతో జగన్ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. మండలంలోని పుల్లమానాయుడు కండ్రిగ, ఎన్‌ఆర్ కమ్మపల్లి, బొప్పరాజుపల్లి, కొత్తకండ్రిగ పంచాయతీల నుంచి ఐదు మంది టిడిపి కార్యకర్తలు వైసిపిలో చేరినట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, పెరుమాల్ రెడ్డి, భానుకుమార్ రెడ్డి, రాంభద్రయ్య, పవన్‌కుమార్‌రెడ్డి, మండల యువత అధ్యక్షులు పుష్పకాంత్ రెడ్డి, ఆ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: జగన్ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని ఎంఎల్‌ఎ సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని పాలేరు గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఈనెల 7వ తేది ఆదివారం పూతలపట్టు నియోజకవర్గానికి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని స్వాగతం పలకాలన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసిపిని అధిక మెజార్టీతో గెలిపించడానికి ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్తా పాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి మాజీ ఛైర్మన్ కుమార్‌రాజా, మాజీ ఎంపిపి సుగుణాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్టు కమిటీ ఛైర్మన్ దత్తురెడ్డి, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి శిరీష్‌రెడ్డి, సర్పంచులు అన్నామలైరెడ్డి, దొరస్వామి, శతర్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేంద్ర, విజయకుమార్, సుబ్రమణ్యం పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

సెల్‌టవర్లతో ఆరోగ్యానికి ముప్పు

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వైనం
ఆదాయం రాదు..అనుమతులు లేవు
పేరుకుపోతున్న బకాయిలు
నిద్రావస్థలో అధికారులు



సెల్‌టవర్లు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న సెల్‌టవర్లు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అనుమతులు పొందక ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో సెల్‌టవర్ ఏర్పాటుకు పంచాయతీ అనుమతి పొందాల్సి ఉంటుంది. ఇలా అనుమతి పొంది ఏర్పాటు చేసిన వాటికి పంచాయతీలో పన్ను కటాల్సి ఉంటుంది. అయితే కొన్ని సంస్థలు పన్నులు కట్టకుండా ఎగవేస్తున్నాయి. ఫలితంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండిపడుతోంది. చిత్తూరు మున్సిపాలిటీ పరిధిలో బిఎస్‌ఎన్‌ఎల్, ఇతర ప్రయివేటు సంస్థలకు చెందిన సెల్‌టవర్స్ 25 వరకూ ఉన్నాయి. వీటి నుంచి మున్సిపాలిటీకి రూ.15 లక్షల మేర బకాయిలు ఉన్నట్లు సమాచారం.

సెల్‌టవర్ల ఏర్పాటుపై ప్రజల్లో ఎన్నో అనుమానాలు రేకెత్తుతున్నాయి. వీటిని ఏర్పాటు చేసిన సమీప ప్రాంతాలలో ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ తరంగాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఇది మనిషి జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతుందని ఆరోగ్య సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ప్రజలకు వచ్చే ఇబ్బందులను నివృతి చేయాల్సిన సెల్‌టవర్ కంపెనీలు జనావాసాల మధ్య సెల్‌టవర్లను ఏర్పాటు చేసుకుంటూ పోతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోని ప్రభుత్వాలు కనీసం వీటి ఏర్పాటుతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందా అంటే అదికూడా సక్రమంగా రావడం లేదనే చెప్పాలి. అనుమతులు లేకుండా సెల్‌టవర్లు ఏర్పాటు చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

నిబంధనలు గాలికి..

పంచాయతీలో టెలికమ్యూనికేషన్ టవర్ల స్థాపన నియమావళి-2012 ప్రకారం కంపెనీలు టవర్లను ఏర్పాటు చేసే ముందు ఒక్కో టవర్‌కు రూ.15 వేల చొప్పున చెల్లించాలి. ఈ నిబంధన అమలులోకి రాక మునుపే టవర్లు ఏర్పాటై ఉంటే సంబంధిత కంపెనీలు ఒకే మొత్తంలో పంచాయతీలకు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంది. ఆ తరువాత ఏటా రూ.1000 చొప్పున అనుమతి పునరుద్ధరణకు వార్షిక రుసుం చెల్లించాలి. అయితే కంపెనీలు మాత్రం ఇష్టాపై ఏర్పాటు చేస్తున్న వాటికి రూ.12 వేల చొప్పున మాత్రమే చెల్లిస్తున్నాయి. మిగిలిన టవర్లకు పంచాయతీల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. ఇలా జిల్లాలో తొమ్మిది వందలకు పైగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అనుమతులు తీసుకునేందుకు చెల్లించాల్సిన రుసుం మాత్రమే చెల్లిస్తూ, అనుమతి పునరుద్ధరణకు ఏటా చెల్లించాల్సిన వెయ్యి రూపాయలను ఎగవేస్తుండటంతో ఏటా జిల్లాలోని పంచాయతీలు రూ.7 లక్షలకు పైగా ఆదాయాన్ని కోల్పోతున్నాయి. 2012 టెలీ కమ్యూనికేషన్ టవర్ల పునరుద్ధరణ చట్టం ప్రకారం పంచాయతీలకు రావాల్సిన లక్షల రూపాయలు సెల్ టవర్ కంపెనీలు పంచాయతీలకు చెల్లించకుండా ఎగవేస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. పంచాయతీల అభివృద్ధికి ఉపయోగించాల్సిన ఈ నిధులను రాబట్టడంలో పంచాయతీ కార్యదర్శులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

నిబంధనలు ఇవే....

కొత్తగా టవర్లు ఏర్పాటు చేసే కంపెనీలు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి ప్రాథమికంగా అనుమతి పొందాలి. ఆ తరువాత నిర్మాణ ప్రాంతం నేల స్వభావాన్ని గుర్తించేందుకు ఇంజినీరింగ్ సంస్థ నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన తరువాత స్థల యజమానితో ఒప్పందం చేసుకొని నిర్మాణం చేపట్టాలి. టవర్లు వినియోగించుకునేందుకు, పంచాయతీ లైసెన్స్ పొందేందుకు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారి నుంచి రూఫ్ యాంటీనాను ధ్రువపత్రం జతచేయాల్సి ఉంటుంది. వీటితో పాటు అగ్నిప్రమాదాలు, మెరుపులు వంటి వాటికి సంబంధించిన జాగ్రత్తలు పాటించి అగ్నిమాపకశాఖ అనుమతులు పొందాలి. ఏర్పాటు చేసిన భవనం, ఆ ప్రాంతంలో ప్రజా సంక్షేమానికి ఏదైనా నష్టం వాటిల్లితే పూర్తి బాధ్యత వహిస్తామని చట్టబద్ధమైన హామీ పంచాయతీకి సమర్పించాలి. ఇళ్ల పైకప్పులపై ఏర్పాటు చేస్తే చుట్టు పక్కల భవన యజమానుల నుంచి అభ్యంతరం లేదని ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది. ప్రజల జీవితాలు, ఆస్తులకు సెల్ టవర్‌తో నష్టం వాటిల్లితే భర్తీ చేసేందుకు బీమా ప్రీమియం, ప్రభుత్వం చెల్లించే నష్టపరిహారాన్ని చెల్లించటానికి టవర్ కంపెనీ గ్రామ పంచాయతీకి అంగీకారపత్రం ఇవ్వాలి. ఆ తరువాత నేలపై ఏర్పాటుకు అనుమతి ఫీజుగా రూ.15 వేలు, ఇంటి పైభాగంలో ఏర్పాటు చేసేందుకు రూ.12 వేల చొప్పున చెల్లించి అనుమతి పొందాలి. ఇలా జిల్లాలో అనుమతులు లేనివి 11 వందలకు పైగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

అనుమతులు లేని ప్రాంతాల్లో

ప్రజాభద్రత, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ రేడియేషన్‌పై ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక ప్రకారం ఎక్కువ జనసాంద్రత కలిగిన నివాస ప్రాంతాలు, పాఠశాలలు, ఆటస్థలాలు, ఆస్పత్రులు, పబ్లిక్ స్థలాల్లో టవర్లు ఏర్పాటు చేయకూడదు. ఇటువంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేయకుండా ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత మున్సిపాలిటీల్లో హెల్త్ ఆఫీసర్, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శిపై ఉంటుంది. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేస్తున్న సెల్‌టవర్ల వివరాలు జిల్లా పంచాయతీ అధికారికి పంపాల్సి ఉంటుంది. ఏవైనా ఆక్షేపనలు ఉంటే జిల్లా పంచాయతీ అధికారి అనుమతిని రద్దు చేయవచ్చు. ఏర్పాటు చేసిన టవర్ల వల్ల ప్రజా ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఇతర ఇబ్బందులు ఉన్నా రద్దు చేసే అధికారం పంచాయతీ కార్యదర్శికి ఉంటుంది.

బాధ్యతేది...

సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్న కంపెనీలు వాటి చుట్టూ కంచెను ఏర్పాటు చేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉంది. అయితే ఇలాంటి చర్యలు తీసుకోక పోవడంతో ప్రేమలు, ఉద్రేకాలకు గురవుతున్న యువత ఆత్మహత్యకు పాల్పడేందుకు సెల్‌టవర్స్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలు తరచూ జిల్లాలో చోటు చేసుకుంటున్నా సెల్ టవర్ల చుట్టూ కంచెను ఏర్పాటు చేయడంలో మాత్రం నిర్వాహకులు శ్రద్ధ చూపడం లేదనే చెప్పాలి.

సంక్షేమ పథకాలు అందించడమే 'జన్మభూమి' ధ్యేయం

ప్రజాశక్తి-యాదమరి

అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయమని జడ్‌పి ఛైర్‌పర్సన్ గీర్వాణి అన్నారు. బుధవారం మండలంలోని దాసరపల్లి పంచాయతీలో జన్మభూమి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా రూ.10 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని, పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ లలితకుమారి, ఎంఎల్‌సి పోతుల సునీత, జయచంద్రనాయుడు, జడ్‌పి సిఇఒ తుకారం, ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, టిడిపి ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్, జిల్లా అధ్యక్షులు నాని, ఎంపిడిఒ పారిజాతం, తహశీల్దార్ రెడ్డప్ప, అన్ని శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.



యాదమరిలో.. జడ్‌పి ఛైర్‌పర్సన్‌ను ప్రశ్నిస్తూ...

చిత్తూరు అర్బన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందేలా చూసేందుకే జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు నగర మేయర్ హేమలత అన్నారు. బుధవారం నగర పరిధిలోని 7, 8, 9, 10, 11, 41వ డివిజన్లలో జన్మభూమి సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ బాలసుబ్రమణ్యం, డిప్యూటీ మేయర్ సుబ్రమణ్యం, టిడిపి నేతలు మాపాక్షి మోహన్, కఠారి ప్రవీణ్, పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని



బంగారుపాళ్యంలో..సీమంతాలు చేస్తున్న దృశ్యం

జడ్‌పిటిసి కళావతి అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూరుపల్లి, కటప్పగారిపల్లి, బోడబండ, నలగాంపల్లి, తిమ్మోజిపల్లి గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్, ఎంపిడిఒ దయానంద్, తహశీల్దార్ మురళి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: ప్రచారార్భాటానికి నాలుగు విడతలుగా నిర్వహించిన జన్మభూమి గ్రామ సభల్లో విసుగు చెందిన ప్రజలు 5వ విడత నిర్వహించిన జన్మభూమి సభల్లో అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు నిలదీస్తున్నారు. బుధవారం కొత్తూరు, పాడిపేట, ముండ్లపూడి గ్రామాల్లో జన్మభూమి, మాఊరు కార్యక్రమాల్లో పలుచోట్ల నిలదీతల పరం సాగింది. పింఛన్లు, రేషన్‌కార్డులపై లబ్ధిదారుల నుంచి అధికారులు తీవ్ర ఆగ్రహం చవిచూడాల్సి వచ్చింది.



తవనం పల్లిలో...

తమ సమస్యలను పరిష్కరించని జన్మభూమి సభలు ఎందుకంటూ అధికారపార్టీ జిల్లా ప్రతినిధులు, అధికారుల ముందు అక్కసు వెళ్లగక్కారు. కార్యక్రమంలో తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, జడ్‌పిటిసి సుభాషిని, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జనార్ధనయాదవ్, ఎంపిడిఒ రవికుమార్ నాయుడు, తహశీల్దార్ రాజగోపాల్, మెప్మా పీడీ జ్యోతి, ఇఒపిఆర్‌డి రూపేంద్రనాథ్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పాకాల: జన్మభూమి కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కావలివారిపల్లి, కె.వడ్డేపల్లి, అత్యమ్మఅగ్రహారం, బైలపల్లి గ్రామాలలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ గ్రామ ప్రజలు రేషన్ కార్డులు, పింఛన్లు, పట్టాదారు పాసుపుస్తకాలు, 104 వైద్యవాహనం రావడం లేదని అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, సర్పంచులు కళావతి, గణేష్, వరలక్ష్మి, సుమలత పాల్గొన్నారు.



తిరుపతి రూరల్‌లో...తుడా ఛైర్మన్‌ను నిలదీస్తూ...

తవణంపల్లి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్‌సి పోతుల సునీత అన్నారు. బుధవారం మండలంలోని మాధవరం, మల్లకుంట, కట్టకిందపల్లి, గోవిందరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో జన్మభూమి గ్రామ సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ సప్తగిరి ప్రసాద్, జెట్టిపల్లి శ్రీనివాసులు, వేణుగోపాల్‌నాయుడు, గాలి దిలీప్‌కుమార్, భాస్కర్‌నాయుడు, జడ్‌పిటిసి వెంకటేశ్వరచౌదరి, ఎంపిడిఒ రవికుమార్, తహశీల్దార్ వరలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే మహిళలకు ఆదర్శం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్త్రీ విద్యా ప్రాప్తికి పాటుపడ్డ సంఘ సంస్కర్త, రచయిత సావిత్రిబాయి పూలే నేటితరం మహిళలకు ఆదర్శమని కేవీపీఎస్ డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి సురేష్ అన్నారు. జ్యోతీరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే 187వ జయంతి వేడుకలను కేవీపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక రుగ్మతలు, మూఢనమ్మకాలు బలంగా ఉన్న ఆ రోజుల్లో సావిత్రిభాయి పూలే స్త్రీ విద్యకోసం ఉద్యమించారని గుర్తు చేశారు. కుప్పమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. పట్టణ టీడీపీ నాయకులు జ్యోతీభాయి పూలే జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళుల అర్పించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ముత్యాల పార్థసారధి మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికోసం పాటుపడ్డ ధీరవనిత జ్యోతీభాయి అన్నారు. కార్యక్రమంలో గురవయ్యనాయుడు, పీఆర్‌మోహన్, వెంకటేశ్వర్లు, చక్రాల ఉష, పులిరామచంద్ర, పోలూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కెవిబిపురం

మండలంలోని కస్తూరిపురం ఎస్టీ కాలనీలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు సిఐటియు మండల కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి మూడో తేదీన ఆమె జన్మదినం సందర్భంగా కస్తూరిపురం ఎస్టీ కాలనీలో జయంతి సభను ఏర్పాటు చేసినట్లు సూచించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్యవేడు డివిజన్ కార్యదర్శి దాసరిజనార్దన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలని,అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో దేశమ్మ, కన్నెమ్మ, గురవయ్య, బాలయ్య, చిరంజీవి, మురళి, రమేష్‌లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నాగలాపురం

నేటి ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తూ అన్ని రంగాలల్లో రాణిస్తున్న భారత మహిళల విద్యకు మూలం సావిత్రిబాయి పూలేనని ఎస్‌ఎస్‌పురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం సావిత్రిబాయి 187వ జయంతిని తమిళనాడు మహాబలిపురం బీచ్‌లో ఘణంగా నిర్వహించారు. 60మంది విద్యార్థులతో విహారయాత్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వేషధారణతో ఆమె అక్షరాలు ఇసుకతో రాసి బీచ్‌లో ఆకర్షణీయంగా నిలిచింది. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచి పెట్టారు.

సావిత్రిబాయి పూలే జయంతిని బాలిక అక్షరాస్యత దినంగా ప్రకటించాలి...సిపిఎం

సావిత్రి బాయి పూలే జయంతి భారతదేశంలో తొలి ఉపాధ్యాయురాలుగా సావిత్రిబాయి పూలే చేసిన సేవలు మరువరాదని సిపిఎం మండల కార్యదర్శి మురిగేషన్ అన్నారు. నాగలాపురం, వెస్ట్ హరిజనవాడ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం మురిగేషన్ మాట్లాడుతూ 1848లో మహారాష్ట్రలోని పూణెలో బాలికల కోసం మొదటి పాఠశాలను ప్రారంభించారని ఇది నచ్చని ఆగ్రకుల మనువాదులు ఆమెపై భౌతిక దాడులకు, వేధింపులకు పూనుకున్నారని తెలిపారు. అనంతరం పిల్లలకు సావిత్రిబాయి పూలే జీవితచరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు శర్వాన్, హెచ్‌ఎం సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు రంజిత్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరదయ్యపాళెం

సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని స్థానిక అమ్మా భగవాన్ సేవా సమితి వారు మండల ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యంలో మండలంలోని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు సునీల్‌దాసాజీ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అనేక రంగాలల్లో రాణిస్తూ మగవారికి సమానంగా దూసుకుపోతున్నారన్నారు. ఎంపిపి జీవమ్మ, మహిళ ఎంపిటీసీలు, ఎంఇఒ సరస్వతి, ఎక్స్ జెడ్పీటీసి వెంకటక్రిష్ణయ్య, యుటిఎఫ్ నాయకులు షణ్ముగరావు, శశికుమార్, ఎస్‌టియు నాయకులు పూడి శ్రీనివాసులు, శ్యామ్‌సుందర్‌లు పాల్గొన్నారు.



6న జాబ్‌మేళా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 6వ తేదీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. నిరుద్యోగ యువకులు మాత్రమే మేళాకు అర్హులని ఆమె తెలిపారు. ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్‌లో ఉద్యోగావకాశాలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని అన్నారు. మెషిన్ ట్రైనీ ఆపరేటర్స్, ఆపరేటర్ పార్ ఫౌండరీ ఉద్యోగాల కోసం ఐటీఐ, ఇంటర్, పది పాసైన నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె చెప్పారు. 18 నుంచి 28 సంవత్సరాల లోపు యువకులు మాత్రమే అర్హులని అన్నారు.

చంద్రన్న కానుకలు పంపిణీ

తిరుపతి (మంగళం) సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తెల్లరేషన్‌కార్డు దారులకు చంద్రన్న కానుక ఇస్తోందని శెట్టిపల్లి పంచాయతీ సర్పంచ్ బత్తల స్వప్న అన్నారు. బుధవారం పంచాయతీలోని తుడా క్వార్టర్స్‌లో సర్పంచ్ లబ్ధిదారులకు చంద్రన్న కానుకను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పండుగలు సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చంద్రన్న కానుకలు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిటిడి నేతలు ఈశ్వరయ్య, చలపతి, ఎవియం శ్రీనివాసరావు, కుప్పారెడ్డి, వార్డు మెంబర్ గోపీనాథ్, కెసి బత్తయ్య,డీలర్లు రాదమ్మ, వనితాలక్ష్మి, ఉషారాణి పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కెవిబిపురం మండలంలోని ప్రజలకు విషజ్వరాల బారినపడకుండా ఉండటానికి ముందుస్తు చర్యలుగా ప్రతి గ్రామంలో దోమల నివారణకు మందుల పిచికారి చేయాలని డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మురికి గుంటలో నీరు నిల్వఉండకుండా చూడాల్సిన బాధ్యత ఆయా గ్రామ సర్పంచ్‌లు, సెక్రటరీలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, సెక్రటరీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు మార్కెట్ యార్డ్ పదవులు

ప్రజాశక్తి-వరదయ్యపాళెం మండలానికి చెందిన తెలుగుదేశం నాయకులు పవన్‌కి నాగలాపురం మార్కెటింగ్ యార్డ వైస్ ప్రెసిడెంట్ పదవి రావడం విధితమే. ఇందుకు సంబంధించి వీరితో పాటు ఎన్నో సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీకి కృషి చేసిన కార్యకర్తలు నవాబ్, శేఖర్, సురేష్‌రెడ్డి తదితరులకు మార్కెట్ సభ్యులుగా అవకాశం ఇచ్చారు. దీంతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసిన వైస్ ప్రెసిడెంట్ పవన్ తనకు పదవి రావడానికి కారణమైన ముఖ్యమంత్రి, నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మార్కెట్ యార్డుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంలో ఉన్నతస్థాయి అధికారుల సహాయ, సహకారాలు తీసుకొని పనిచేస్తామన్నారు.

మూగజీవాలను కాపాడండి

ప్రజాశక్తి-నాగలాపురం వ్యాధుల బారినపడకుండా మూగజీవులను కాపాడుకోవాలని సత్యవేడు ఎడి వెంకటయ్య తెలిపారు. బుధవారం మండలంలోని బీరకుప్పం, కడివేడు గ్రామాలల్లో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. వ్యాధిగ్రస్తు పశువులు 224 , 41 గర్భకోశ వ్యాధులు, 220 గొత్తెల నట్ట నివారణ, 109 దూడల నట్ట నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ ప్రభుత్వం మూగజీవులకు అందిస్తున్న ఉచిత మందులను సద్వినియోగం చేసుకొని మూగజీవులు వ్యాధులు బారినపడకుండా ఆరోగ్యంగా ఉండేటట్లు చూసుకోవాలని ఆయన తలెపారు ఆ కార్యక్రమంలో పశు వైద్యాధికారి మురళీకృష్ణ, సిబ్బంది వెంకటేష్, ధర్మా, మోహన్, బాలాజీ, నారాయణ, సరస్వతిలు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న ఎడి

జన్మభూమి విజయవంతం



ప్రజాశక్తి-రేణిగుంట

మండలంలోని గుత్తివారి పల్లి, మల్లవరం పంచాయతీలల్లో బుధవారం ఐదో విడత జన్మభూమి కార్యక్రమాన్ని పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, జెడ్పిటిసి చెర్లోపల్లి లీలావతి, రామస్వామి, ఎంపిపి స్వాతి, వైస్ ఎంపిపి సుజాత పాల్గొన్నారు. అనంతరం గుత్తివారిపల్లిలోని మహిళలు తహశీల్దార్ నరసింహులు నాయుడుకు వినతిపత్రాలు సమర్పించి తమకు ఇంటి స్థలాలు కేటాయించాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరిసింహులు నాయుడు, ఎంపిడిఒ సుధాకర్, మునస్వామి నాయుడు, విశ్వనాథ్ యాదవ్, భాస్కరరెడ్డి,మాధవరెడ్డి, సర్పంచ్‌లు వసంతమ్మ, మునిశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.

కెవిబీపురం: మండలంలో అంజూరు, పవనవారికండ్రిగ, సూరమాల గ్రామాలల్లో జన్మభూమి నిర్వహించినట్లు టిడిపి మండలాధ్యక్షుడు మునస్వామి యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి చేసిన సేవల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మార్కెట్ ఛైర్మన్ రామాంజులు నాయుడు, వైస్ ఎంపిపి కిరణ్‌యాదవ్, సర్పంచ్ అధ్యక్షరాలు భారతిచెంగారెడ్డి, జెడ్పీటీసీ వాణి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నాగలాపురం: మండలంలో జన్మభూమి గ్రామ సభలో జనం లేకున్నా జన్మభూమి టీమ్ అధికారులు మాత్రం అధికంగా విచ్చేస్తున్నారు. ఐదో విడత జన్మభూమి పురస్కరించుకొని బుధవారం బీరకుప్పం, కడివేడు గ్రామాలల్లో సభ నిర్వహించారు. కడవేడ గ్రామ సభకు ముఖ్య అతిథిగా సత్యవేడు నియోజక వర్గ ఎమ్మెల్యే తలారిఆదిత్య పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల కోసం ప్రభుత్వం జన్మభూమి నిర్వహిస్తుందని తెలిపారు.ఎంపిపి కల్పన, జెడ్పీటీసీ సుజాత, ఎంపిడిఒ కలీల్‌సాహేబ్, ప్రత్యేకాధికారి భాస్కర్, ఎంఇఒ బాబయ్య, జన్మభూమి కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-వరదయ్యపాళెం

సిపిఎస్ విధానాన్ని రద్దుచేయాలని ఎస్‌టియు జిల్లా కార్యదర్శి చిన్నయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల బృందం బుధవారం జన్మభూమి నోడల్ అధికారికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ సిపిఎస్ విధానంతో ఉపాధ్యాయులకు అన్ని రకాల నష్టం వాటిల్లుతుందని వెంటనే ఈ విధానాన్ని రద్దుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఇందుకు సంబంధించి నెల్లటూరు గ్రామంలో జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.

ముఖ్యమంత్రి పర్యటనకు అధికారుల ఏర్పాట్లు




స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-వరదయ్యపాళెం ఈనెల తొమ్మిదో తేదీన వరదయ్యపాళెం మండలంలో అపోలో టైర్లు పరిశ్రమ భూమి పూజకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరవుతున్న విషయం విధితమే. ఈ కార్యక్రమానికి సంబంధించి అధికారులు ఏర్పాటు పనిలో నిమగ్నమయ్యారు. బుధవారం తిరుపతి సబ్ కలెక్టర్ నిషాంత్‌కుమార్, పుత్తూరు డిఎస్పీ , ఎపిఐఐసి, ఇండ్రస్టియల్ అధికారులు భూమి పూజ జరిగే స్థలాన్ని పరిశీలించారు.

నగరి, ప్రజాశక్తి : పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడానికే జన్మభూమి మా ఊరు కార్యక్రమం లక్ష్యమని ఎమ్మెల్సీ ముద్దు కృష్ణమ నాయుడు పేర్కొన్నారు. బుధవారం నగరి మున్సిపాలిటీ పరిధిలోని 3,4,5 వార్డులలో కౌన్సెలర్లు ఆధ్వర్యంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు బిడి భాస్కర్, కార్యదర్శి గుణశేఖర్, జన్మభూమి కమిటీ సభ్యులు, అనీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమిలో ఛైర్ పర్సన్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్

నగరి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో బుధవారం జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ఛైర్ పర్సన్ కేజే శాంతి అధికారులను, ప్రజాప్రతినిధులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఒక మహిళ అని కూడా చూడకుండా తనపై దౌర్జన్యం చేసి, కేసులు వున్న వారిని జన్మభూమి కమిటీ సభ్యులుగా నియమించడం శోచనీయం అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిని అడ్డుకునే వ్యక్తులను జన్మభూమి కమిటీ సభ్యులుగా వ్యవహరించడం విడ్డూరంగా వుందన్నారు. అలాంటి వారు ఉన్న చోటు మేము ఉండమని బాయకట్ చేశారు.

రాజీలేని పోరాటాలకు మహాసభలు వేదిక కావాలి : సిపిఐ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

రానున్న కాలంలో రాజీలేని పోరాటాలకు మహాసభలు వేదిక కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామానాయుడు పేర్కొన్నారు. స్థానిక బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలంలో ఆ పార్టీ నగర సమితి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రలోని బిజెపి ప్రభుత్వం అరాచకాలకు నిలయంగా మారిందన్నారు. సిపిఐ నగర కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ తిరుపతి సిపిఐ మహాసభలు ఈ నెల 27, 28 తేదీల్లో జరుగుతున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాధాకృష్ణ, ఎన్.డి.రవి, చలపతి, శ్రీరాములు పాల్గొన్నారు

తిరుమల సమాచారం



శ్రీవారి సేవలో నేడు

తెల్లవారుజామున 3 నుంచి 3.30 వరకు సుప్రభాతం. 4-5.00 సర్వదర్శనం.4-4.30 తోమలసేవ, 4.30-4.35 కొలువు, పంచాంగ శ్రవణం. 4.30-5.00 మొదటి అర్చన, సహస్రనామార్చన. ఉదయం 5.30 మొదటి గంట, సాత్తుమొర, 5.45-7 విఐపి దర్శనం. 6.30 విశేషపూజ. 7 నుంచి రాత్రి 7.30 గంటల వరకు సర్వదర్శనం. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వకు ప్రత్యేక ప్రవేశ దర్శనం. 10.00-10.10 వరకు శుద్ధి. రెండో అర్చన. మధ్యాహ్నం 12.00-1.00 కళ్యాణోత్సవం. 1.00-1.30 డోలోత్సవం. 1.30 - 2.00 వైభవోత్సవం మండపంలో ఆర్జిత బ్రహ్మోత్సవం. 2.00-2.30 వైభోత్సవంలో వసంతోత్సవం. సాయంత్రం 5.00-6.00 ఉత్సవ మూర్తుల ఊరేగింపు. రాత్రి 7.00-7.30 శుద్ధి, రాత్రి కైంకర్యాలు. 7.30-7.45 నైవేద్యం గంట, 7.45 నుంచి అర్ధరాత్రి వరకు సర్వదర్శనం. అర్ధరాత్రి 1.00 గంటలకు ఏకాంత సేవ ఏర్పాట్లు, 1.30 గంటలకు ఏకాంతసేవ.

తిరుమల సమాచారం

వయోవృద్దులు, దివ్యాంగులను శ్రీవారి ఆలయానికి ప్రత్యేకంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అనుమతిస్తారు. పూటకు 700 మంది వంతున నిర్దేశించిన సమయం కంటే గంట ముందుగా హాజరై నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. చంటిబిడ్డలతో పాటు తల్లిదండ్రులను సుపథం నుంచి ఆలయానికి ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచితంగా అనుమతిస్తారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభమవుతుంది.

తిరుమలలో నేడు

తిరుమలేశుని ఆలయంలో తెల్లవారిజామున మూడు గంటలకు శ్రీవారి సుప్రభాతం సేవ మొదలవుతుంది. ఉదయం ఐదున్నార గంటలకు విఐపి దర్శనం ప్రారంభమవుతుంది. కేంద్రీయ విచారణ కార్యాలయ ప్రాంగాణంలోని ఆర్జితం కౌంటరు ద్వారా ఉదయం 11 గంటల నుంచి ఆర్జిత సేవలకు సంబంధించిన టిక్కెట్లు నమోదు ప్రారంభమవుతుంది. ఎలక్ట్రానిక్ లాటరీ రవిధానం కింద తోమల, అర్చన, సుప్రభాతం, కల్యాణోత్సవం టిక్కెట్లను టిటిడి కేటాయిస్తుంది. పొర్లుదండాల టోకెన్లను మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఉచితంగా జారీ చేస్తారు. నాదనీరాజనం వేదిపై సాయంత్రం ఆరు గంట నుంచి మృదం విన్యాస కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

టిటిడి టోల్‌ఫ్రీ నెంబర్ : ఫిర్యాదులు, సూచనలు చేయడానికి, ఇతర సమాచారం కోసం ఉచిత టోల్‌ఫ్రీ నెంబర్ : 1800-425-4141 ద్వారా తెలియజేయవచ్చు.

డిసిఐ ప్రయివేటీకరణను అడ్డుకుందాం : సిఐటియు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(డిసిఐ)ని ప్రయివేటీకరించాలని మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని, వారి కుట్రలను అడ్డుకుందామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1976లో ఏర్పడిన డిసిఐ 28 కోట్ల పెట్టబడితో ప్రారంభమై నేడు 6 వేల కోట్ల ఆస్తులు కలిగి ఉందన్నారు. భారతదేశంలోని అన్ని పోర్టుల అభివృద్ధికి అద్భుతంగా కృషి చేసిందని, అలాంటి డిసిఐని ప్రభుత్వ రంగ సంస్థను ప్రయివేట్ వాళ్లకు అప్పగించడానికి అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొవాలన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటాన్ని బలపరచాలని, మృతుడు వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండు చేశారు. ఈ నెల 5న జిల్లాలోని అన్ని సిఐటియు కమిటీలు, యూనియన్లు, కార్మికులు సంఘీభావంగా విరాళాలు సేకరించాలని పిలుపునిచ్చారు.

జన్మభూమి పేదలకు వరం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

జన్మభూమి, మా ఊరు పేదలకు వరమని ఎమ్మెల్సీ గాలిముద్దు కృష్ణమ నాయుడు పేర్కొన్నారు. పురపాలక సంఘం 6వ వార్డులో జన్మభూమి, మా ఊరు కార్యక్రమం మున్సిపల్ ఛైర్మన్ యుగంధర్, కమిషనర్ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ గాలిముద్దుకృష్ణమ నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఎస్ గణేష్, మాజీ ఛైర్మన్ కరుణాకరన్, మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డిఇ మహమ్మద్ రఫీ, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

చౌడేపల్లి : మండలంలో బుధవారం చారాల,సెట్టిపేట పంచాయతీలలో తూతూమంత్రంగా జన్మభూమి కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి వెంకట్రమణరాజు,మరియు సమన్వయ కర్త శ్రీనాథ్‌రెడ్డిలు ముఖ్య అథిధులు గా వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమశ్యలను క్షేత్రస్థానుంచి పరిష్కరించేదుకే ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెటాన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత,తెదెప మండల అధ్యక్షులు గువ్వలరామక్రిష్టారెడ్డి తో పాటు ఆయాశఖలకు చెందిన అధికారులు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

నేడు గుంటూరులో శ్రీనివాస కల్యాణం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

శ్రీవారి వైభవాన్ని నలుదిశల వ్యాప్తి చేసేందుకు ఈ నెల 4న గుంటూరు జిల్లాలో శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస కల్యాణం ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ప్రభాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా చుండూరు మండలం ఆలపాడు గ్రామంలో జరిగే కల్యాణోత్సవంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కీర్తిని పెంచేది ఉపాధ్యాయ వృత్తి ఒక్కటే

ప్రజాశక్తి-తిరుపతి సిటి

సభ్యసమాజంలో ప్రతి వ్యక్తి కీర్తిప్రతిష్ఠను పెంచేది ఉపాధ్యాయవృత్తి ఒకటేనని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టరు రాళ్లపల్లి సుధారాణి తెలిపారు. స్థానిక భీమాస్ రెసిడెన్సీ హోటల్‌లో బుధవారం జరిగిన గేట్ విద్యా సంస్థల డిఎడ్ కళాశాల సీనియర్ విద్యార్థుల వీడ్కోలు సభకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ మార్పుకు, సహజమైన ఒర్పుకు, సరైన తీర్పును నాంది పలికేది గురువులేనని పేర్కొన్నారు. నవ సమాజ నిర్మాణానికి పునాది వేసేది కూడా ఉపాధ్యాయులేనని తెలిపారు. విద్యార్థులు విద్యాప్రమాణాలను పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని వెంకటేశ్వర్లు, రాజశేఖర్, స్వాతి, భార్గవి, రోహిణి, డిఎడ్‌విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎంసి బిల్లుకు మద్దతుగా వైద్యుల ర్యాలీ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్ఎంసి బిల్లుకు మద్దతుగా ఏపి ఆయూష్ డాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయూష్ వైద్యులు బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఆసంఘం నాయకులు హరీష్ మాట్లాడుతూ 2003 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా ఎంతో మంది ఆయూష్ వైద్యులు వేల సంఖ్యలో ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండు చేశారు. 2008 ఆయూష్ హౌస్ సర్జన్, పోస్టు గ్రాడ్యుయేట్ స్కాలర్స్‌కు స్టైఫండ్ హైక్ కూడా వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టరు కేథరినాథ్, డాక్టరు జగన్మోహన్‌మూర్తి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-చౌడేపల్లి



ఆత్మహత్య చేసుకున్న భాస్కర్

మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం వంండలంలో చోటుచేసుకుంది. మృతుని భార్య క్రిష్ణవేణి పోలీసులకు ఇచ్చిన పిర్యాదు మేరకు వివరాలిలాఉన్నాయి. మండల కేంద్రం చౌడేపల్లి పరిధి లోగ చిన్నకొండామర్రి గ్రామంలో కాపురముండు గోవిందప్ప కుమారుండు భాస్కర(38)స్థానిక చౌడేపల్లి లో మంగల షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులున్నారు.వారం క్రితం తన అన్న ఇంటిలో బంగారం డబ్బులు అపహరించాడు.గ్రామంలోని పెద్దలు ఈ విషయంపై గ్రామంలో పంచాయితీ చేసి విచారించగా నగలకు నాకు ఎలాంటి సంభందంలేదన్నాడు. రాజనాలబండకు ప్రమాణకానికి తీసుకొని పోగా అక్కడకూడా సమాదానం చెప్పలేదు.గత్యంతరం లేక పోలీసులకు పిర్యాదు చేయడంతో పోలీసులకు నగల విషయం తెలిపాడు.నగలను చెడువ్యసనాలకు వాడేసినట్లు గ్రామంలో తెలిసి మనస్థాపానికి గురై చౌడేపల్లి చదుగుట్లపల్లి మార్గమధ్యంలో వ్యవసాయపొలంవద్ద ఓ చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

ఆటోలు సీజ్

ప్రజాశక్తి-చౌడేపల్లి

మండల కేంద్రం చౌడేపల్లి లో బుధవారం 15 ఆటోలను సీజ్ చేసినట్లు చౌడేపల్లి ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. స్థానిక బస్టాండులో ఆయన మాట్లాడుతూ ఓవర్ లోడు,వివిద రికార్డులు లేనందువలన ఆటోలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం మాట్లాడుతు మద్యంసేవించి వాహనాలను నడపరాదన్నారు.అదేవిధంగా డైవర్లు తప్పకుండా లైసెన్సు కల్గిఉండాలన్నారు. రవాణ నిభందనలను అతిక్రమిస్తే అలాంటివారిపై చట్టపర చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు బ్రెయిలీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్దుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4న లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ వేడుకల కమిటీ సభ్యులు చిట్టిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివజ్యోతినగర్‌లోని ప్రభుత్వ అంధుల శరణాలయంలో సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి ఎంపి వరప్రసాద్, తిరుపతి ఎంఎల్ఎ సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్ తదితరులు హాజరవుతారని, ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

స్విమ్స్ ఓపీ వివరాలు



టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ ఓపి వివరాలు. ఓపి సమయం ఉ॥7 నుంచి 11గంటల వరకు, ప్రతి ఆదివారం ఓపికి సెలవు దినం.

గది నెంబరు	విభాగం పేరు	ఓపి రోజు
11	రక్తనమూనాలు సేకరణ కేంద్రం	ప్రతి రోజు
16, 17	సీటీ సర్జరీ	ప్రతి రోజు
18, 19	కార్డియాలజీ(గుండె వ్యాధులు)	ప్రతి రోజు
21, 22, 23	న్యూరాలజీ	ప్రతి రోజు
25, 26	మెడిసిన్	ప్రతి రోజు
29	హెమటాలజీ	ప్రతి రోజు
35,36,37	నెఫ్రాలజీ	సోమ, బుధ, శుక్రవారం
39, 40	ఎండోక్రినాలజీ	ప్రతిరోజు
41	సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ	ప్రతి రోజు
27, 28	న్యూరో సర్జరీ	సోమ, బుధ, శుక్రవారం
31	జనరల్ సర్జరీ, రుమటాలజీ	సోమ, బుధ, శుక్రవారం
39	ప్లాస్టిక్ సర్జరీ	సోమ, బుధ, శుక్రవారం
31	సర్జికల్ అంకాలజీ	మంగళ, గురు, శనివారం
32	మెడికల్ అంకాలజీ	మంగళ, గురు, శనివారం
28	రేడియేషన్ అంకాలజీ	మంగళ, గురు, శనివారం
ప్రత్యేక ఓపి సేవలు		
32	బ్రెస్ట్ క్లినిక్	సోమవారం
25, 26	చెస్ట్ క్లినిక్	సోమ, శనివారం
39, 40	జువైనల్ డయాబెటిక్ క్లినిక్	ప్రతి నెల రెండో శనివారం
39, 40	ఎండోక్రినాలజీ	మంగళవారం
25, 26	రుమటాలజీ క్లినిక్	మంగళ, గురు, శనివారం
39, 40	మాస్టర్ హెల్త్ చెకప్	ప్రతి రోజు

సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు ప్రత్యేక ఓపి సేవలు

పాడి పశువుల కృత్రిమ గర్భోత్పత్తి సూదులు రూ.100కు పెంపు

పుత్తూరు టౌన్ : కృత్రిమ గర్భోత్పత్తికై వంద రూపాయల ఫీజు కింద రైతుల నుంచి వసూలు చేయాలని, దీనిని మార్చి నుంచి అమలు చేయాలని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ డా.రూపసుందరి ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఆవుకు మొదటి సారిగా కృత్రిమ గర్భోత్పత్తి సూదికి రూ.వంద, రెండో సారి సూదికి రూ.90లు వంతున రైతుల నుంచి రుసుము వసూలు చేసి ప్రభుత్వానికి జమచేయాలన్నారు. అలాగే గోపాలమిత్ర కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో పశుగణనను చేపట్టి ఈ నెలాఖరు కల్లా నివేదికను కార్యాలయానికి చేర్చాలని, రైతుల ఇంటికి వెళ్లి పాడి ఆవుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి పయణి, పర్యవేక్షకులు శివాజీ, సురేంద్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫార్మా-డి విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డాక్టర్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు బుధవారం 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ 2008లో అట్టహాసంగా కోర్సులు ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం ఆ తర్వాత కోర్సు పూర్తి చేసిన వారికి క్యాడర్ సృష్టించడంలో నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది విద్యార్థులు ఆరు సంవత్సరాల కోర్సును పూర్తి చేసి పట్టభద్రులైన తరువాత నిరుద్యోగులుగా రోడ్డుపై నిలబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి డాక్టర్ ఆఫ్‌ఫార్మసీ విద్యార్థులకు ఉపాధి కల్పించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ, గీతాంజలి, కావ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల హోరు.. పన్ను వసూళ్లలో లేదు జోరు..

ఇష్టానుసారంగా భారీ హోర్డింగ్‌లు, బ్యానర్లు
శ్రద్ధ చూపని అధికారులు
మున్సిపాలిటీ ఆదాయానికి గండి





పట్టణంలో వివిధ కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: పట్టణంలో హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలను ప్రధాన కూడల్లో కట్టుకోవడానికి మున్సిపాలిటీ ఒక మీటరకు రూ.500లు, ఒక పోల్ లేదా ఒక కర్ర నాటడానికి రూ.200లు పన్నులు చెల్లించాలని నిబంధనలు ఉన్నాయి. కాని వీటిని బేఖాతరు చేస్తూ పట్టణంలో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, సినిమా హాల్స్‌కు చెందిన వారు తమ ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ భారీగా బ్యానర్లు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలను కడుతున్నారు. పట్టించుకొని పన్నులు వసూలు చేయాల్సిన మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండంతో పట్టణం మొత్తం బ్యానర్లతో, కటౌట్స్‌తో, ఫ్లెక్సీలతో నిండిపోయింది. వీటిని గురించి ప్రశ్నించే వారు లేక ఎక్కడ చూసినా రాజకీయపార్టీ నాయకులు బ్యానర్లు నిండిపోయాయి. నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలతో వివిధ కంపెనీలకు చెందిన భారీ హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి ప్రకటన ఛార్జీలను వసూళ్లపై ఏమాత్రం మదనపల్లి మున్సిపాలిటీ శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది. వివిధ కంపెనీలకు చెందిన వ్యాపారప్రకటనలు, రాజకీయపార్టీలకు చెందిన నాయకుల భారీ కటౌట్‌లతో పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లతో పాటు బస్టాండ్లు, రోడ్లలోను, వీధుల్లో ఇష్టమొచ్చినట్లు ఏర్పాటు చేస్తున్నారు. కానీ పన్నులు మాత్రం కట్టకుండా మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడుతున్నారు. 2017 సంవత్సరంలో హోర్డింగ్‌లు, వ్యాపారప్రకటనలు, ప్రచార బ్యానర్లు, ఫ్లెక్సీలు, ప్రయివేటు పాఠశాలల, కళాశాలల బ్యానర్లకు గాను రూ.60వేలకు పైగా వసూలు అయినట్లు మున్సిపల్ అధికార లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది రాజకీయపార్టీల నాయకులు బస్టాండు కూడలిలోను, ప్రధాన రహదారులలోను వందలకుపైగా భారీ కటౌట్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇవిగాక పట్టణంలో వాల్‌పోస్టర్లు సైతం ఇష్టానుసారం అంటించారు. ఇటీవల ఒక ప్రముఖ రాజకీయపార్టీ నాయకుడు వచ్చినపుడు పట్టణమంతా ఫ్లెక్సీలు, బ్యానర్లతో నింపేశారు. నూతనసంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలతో పట్టణంలో చాలామంది ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఈ లెక్కన చూస్తే మున్సిపాలిటీకి వీటిద్వారా లక్షల్లో పన్నులు వసూలు కావాల్సిఉండగా కేవలం వేలల్లో లెక్కలు చూపిస్తుండటం గమనార్హం. పన్నులు వసూలు చేయాల్సిన మున్సిపాలిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పట్టణంలో ఎక్కడ చూసినా హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, వాల్‌పోస్టర్లతో నిండిపోతోంది. ఇందులో మరో విషయం ఏమంటే పర్మినెంట్‌గా ఉండే ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లుకు రూ.7వేలు మాత్రమే లెక్కలు చూపిస్తున్నారు. మిగిలిన వాటి పరిస్థితి ఏమిటో వారే సమాధానం చెప్పాల్సివుంది. ఏది ఏమైనా ఈ బ్యానర్లు, హోర్డింగులు, వాల్‌పోస్టర్లపై పన్నులు సక్రమంగా వసూలు చేస్తే మున్సిపాలిటీకి మరింత ఆదాయం చేకూరుతుందని పలువురు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండలంలోని పెద్దమల్లెల ఉన్నత పాఠశాలలో చదువుతున్న 116 మంది విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించినట్లు జపాలి హనుమాన్ కంప్యూటరైజ్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి అరుంధతి తెలిపారు. ఈ శిబిరంలో ముగ్గురు విద్యార్థులకు కంటి చూపు చాలా తక్కువగా ఉందని, వీరికి రాయితీతో గల కంటి అద్దాలు ఇస్తామన్నారు. ఆయన మాట్లాడుతూ కంటిచూపు లోపం ఉన్న వారు నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగార్జున, ఉదయ్‌కుమార్, శశికళ, గీర్వాని పాల్గొన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట: సంక్రాంతి పండుగను ప్రజలందరూ సుఖసంతోషాలతో చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన చంద్రన్న సంక్రాతి కానుకలను మండలంలోని అన్ని రేషన్ దుకాణాలలో 2వ తేదీ నుండి పంపిణీ చేస్తున్నట్లు బి.కొత్తకోట రేషన్ దుకాణదారులు తెలిపారు. ఇందులో ఆరు నిత్యావసర వస్తువులను కార్డులందరికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సంక్రాంతి కానుక అందరూ తీసుకోవాలని వారు సూచించారు. ఇందులో భాగంగా పట్టణంలోని 1వ రేషన్‌దుకాణంలో రేషన్‌కార్డుదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు.


ఆలయ అభివృద్ధికి రూ.10వేలు విరాళం

ప్రజాశక్తి-రొంపిచెర్ల: దళితవాడలోని ఆలయ అభివృద్ధికి పెద్దగొట్టిగల్లు సర్పంచ్ చిత్తపర్తి రాధ రూ.10వేలు విరాళం అందజేశారు. బుధవారం పెద్దగొట్టిగల్లు గ్రామంలో జరిగిన జన్మభూమి గ్రామ సభలో రామిరెడ్డిగారిపల్లెలోని దళితవాడలోని ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని మహిళలు కోరారు. దీంతో సర్పంచ్ రాధ అప్పటికప్పుడే తన వంతు సహాయంగా రూ.10వేలు ఎంపిపి చల్లా ప్రేమలతమ్మ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రభాకర్‌రావు, మండల ప్రత్యేకాధికారి రవీంద్రబాబు, ఎంపిటిఓ ఉమామల్లీ తహశీల్దార్ వెంకటకృష్ణుడు, వైద్య సిబ్బంది డాక్టర్ సునీత, రాజ, ఎస్సై నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్నందుకు బాబు సిగ్గుపడాలి-జగన్



జగన్‌కు తిలకం దిద్దుతున్న రోజా



జగన్‌ను కలిసేందుకు సభకు వచ్చిన ప్రత్యేక ప్రతిభావంతుడు

ప్రజాశక్తి-కలికిరి: బూటకపు హామీలతో గద్దెనెక్కి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ఉన్న సిఎం చంద్రబాబు సిగ్గుపడాలని వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం జగన్ తలపెట్టిన ప్రజా సంకల్పయాత్ర 51వ రోజుకు చేరుకుంది. కలికిరి బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మంగళవారం పత్రికల్లో వచ్చిన ప్రకటనలో చంద్రబాబు మాట్లాడుతూ ప్రజలు టిడిపికి ఓట్లు వేయకపోతే సిగ్గుపడాలని అన్నారన్నారు. సిగ్గుపడాల్సింది ప్రజలు కాదు అబద్ధపు హామీలతో ముఖ్యమంత్రి అయిన తరువాత ఇచ్చిన హామీలను నెరవేర్చని నువ్వు సిగ్గుపడాలా అని ఎద్దేవా చేశారు. బాబు వస్తే జాబు వస్తుందని భూములు లాక్కుని ఉపాధి కల్పిస్తామని నిరుద్యోగ భృతిని రూ.2 వేలు ఇస్తామని హామీలు ఇచ్చి 1.70కోట్ల కుటుంబాలకు అన్యాయం చేశారని విమర్శించారు. కేంద్రంలో బిజెపికి లాలూచిపడి ప్రత్యేక హోదాను తాకట్టుపెట్టి ప్రజలకు అన్యాయం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేసి తమను గెలిపించి మీరు గెలవాలని కోరారు. కాగా చింతపర్తి నుంచి బయల్దేరి కలికిరి వచ్చిన జగన్‌కు వేల సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు.

బాస్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-మదనపల్లె రూరల్: భీమా కోరేగామ్ మహర్ యోధుల విజయోత్సవ స్థూపం వద్ద జరిగే విజయోత్సవాలకు వెళ్లిన అంబేద్కరీయులపై మనువాద ముష్కరుల దాడిని ఖండిస్తూ స్థానిక న్యూ అంబేద్కర్ సర్కిల్ వద్ద భారతీయ అంబేద్కర్ సేన ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బాస్ వ్యవస్థాపకులు పిటియం శివప్రసాద్ మాట్లాడుతూ రిజర్వేషన్ వ్యతిరేక, లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగ వ్యతిరేక బిజెపి ప్రభుత్వ విధానాలపై నిప్పులు చెరిగారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు శ్రీచందు, గిరిబాబు, సచిన్, రతీష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి-గుర్రంకొండ: చిరుధాన్యాలు అనారోగ్యాలు రాకుండా దూరం చేస్తాయని మండల ఆర్ఐ ప్రవీణ్ ఎల్లుట్ల గ్రామపంచాయితీలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో అన్నారు. ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాలైన రాగులు, సజ్జలు, కొర్రలు వంటివి తినడం వల్ల శరీరధారుఢ్యంతో పాటు షుగర్, బిపి, గుండెపోటు వంటి ఎన్నో రోగాలకు దూరంగా ఉండొచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో రిడో స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి ఐలా ఈశ్వరయ్య, సర్పంచ్ శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐ ప్రవీణ్‌కుమార్

జగన్ సభకు భారీగా ప్రజలు

ప్రజాశక్తి-గుర్రంకొండ: వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో భాగంగా బుధవారం కలికిరిలో జరిగిన బహిరంగసభకు మండలం నుంచి ప్రజలు స్వచ్ఛందంగా భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యులు జమీర్‌ఆలీఖాన్, ఎంపిపి నక్కా చంద్రశేఖర్, మండల కన్వీనర్ ముక్తియార్ ఆలీఖాన్ ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ నిర్వహించి సభకు బయల్దేరారు. ఈ కార్యక్రమంలో గుర్రంకొండ మండల ప్రజలు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన రైతులు

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

మొలకలచెరువు: మండలంలో అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని మండల జెడ్పిటిసి కువైట్ శంకర, ఎంపిపి ఆశాలీకాలేషా అన్నారు. బుధవారం మండలంలోని చౌడసముద్రం గ్రామంలో జన్మభూమి-మా ఊరు గ్రామ సభలు సర్పంచ్ రెడ్డప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్, ఎంపిడిఓ రాజగోపాల్, తహశీల్దార్ అమరేంద్రబాబు, ఏఎంసి వైస్‌చైర్మన్ కెవి.రమణ, వైస్ ఎంపిపి నరసింహారెడ్డి, ఎంపిటిసి మస్తాన్‌వలి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచును నిలదీసిన కమిటీ సభ్యులు

రామసముద్రం: మండలంలోని ఎలకపల్లె పంచాయతీలో బుధవారం జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పంచాయతీలోని నాలుగు గ్రామాల్లో స్థానిక సర్పంచు అధికారం చేపట్టిన నాటి నుండి ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని గాని చేపట్టలేదని సభాముఖంగా సర్పంచును ప్రశ్నించారు. చెంబకూరులో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో అర్జీలు వందల సంఖ్యలో రావడం విశేషం. ఎంపిడిఓ వెంకటసిద్దయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ వెంకటరమణ, వ్యవసాయ శాఖాధికారి సంధ్య, మైక్రో ఇరిగేషన్ అధికారి శ్రీదేవి, సర్పంచులు తిప్పన్న, లక్ష్మీనారాయణమ్మ, ప్రజలు పాల్గొన్నారు.



సర్పంచును నిలదీసిన కమిటీ సభ్యుడు

సమస్యల పరిష్కారానికి వేదిక

తంబళ్లపల్లె: మారుమూల గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి జన్మభూమి కార్యక్రమమే ఓ మంచి వేదికని స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిగారిపల్లె, అన్నగారిపల్లెలో జన్మభూమి, మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. సిసిరోడ్లు, స్మశాన వాటికలు, రహదారులు, భూసమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారం చేయడానికి ప్రయత్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామకృష్ణ, తహశీల్దార్ సురేష్‌బాబు, ఏఓ లీలాకుమారి, ఎపిఎం రవికుమార్, సర్పంచులు మల్లికార్జున, రేణుకమ్మ, మండల స్థాయి అధికారులు, ఎస్సై దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న రైతులు

బిల్లులు చెల్లించండి

గుర్రంకొండ: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సి.రాజుపల్లె పంచాయతీలోని అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని, మరుగుదొడ్ల బిల్లును చెల్లించాలనిత ఎంపిడిఓ రామచంద్రయ్యకు బుధవారం జన్మభూమి కార్యక్రమంలో తెలియజేశారు. శెట్టివారిపల్లె గ్రామ పంచాయతీలో జరిగిన జన్మభూమిలో లబ్ధిదారులు తమ మరుగుదొడ్ల బిల్లులు మంజూరు చేయలేదని అధికారుల చుట్టూ తిరగాల్సివస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామచంద్రయ్య, తహశీల్దార్ రవిచంద్రన్, పంచాయతీ సెక్రటరీలు నరసింహులు, విఆర్‌ఓలు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.




యర్రావారిపాల్యం: మండలంలోని ఎలవపల్లె గ్రామ పంచాయతీలో గల జెడ్పిహైస్కూల్‌లో జన్మభూమి, మా ఊరు కార్యక్రమం ప్రజల మధ్య అట్టహాసంగా స్పెషల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. గతంలో సమస్యలపై అర్జీలు ఇచ్చినప్పటికీ పరిష్కారం చూపలేదని అధికారులను రైతులు నిలదీశారు. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ మురళి, ఎంఆర్‌ఓ శిరీష, జెడ్పిటిసి బొమ్మలకుమార్, ఏఎంసి చైర్మన్ రాజగోపాల్‌నాయుడు, టిడిపి మండల కన్వీనర్ శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

మదనపల్లె రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని టిడిపి నాయకులు అన్నారు. రెండవ రోజు జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో 5, 6, 8వార్డులలో మున్సిపల్ కమిషనర్ భవానిప్రసాద్ అధ్యక్షతన జరిగాయి. ఈ వార్డు సభలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్‌సి బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంఎల్ఎ దొమ్మలపాటి రమేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ భవానిప్రసాద్‌లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాందాస్‌చౌదరి, బి.శ్రీనివాస్, బొమ్మనచెరువు శ్రీరాములు, కామకోటి ప్రసాద్‌రావు, పట్టణ అధ్యక్షుడు పులిమోహన్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి


తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పుత్తూరు అర్బన్

జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో గత కొన్ని సంవత్సరాలుగా పుత్తూరు మండల పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పుత్తూరు తహశీల్దారు వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో పేదలు నిర్మించుకున్న జ్యోతిబసు కాలనీకి తాగునీరు, విద్యుత్ సౌకర్యం, అలాగే డ్రెయినేజి కాలువలు నిర్మించాలని, రోడ్లు వేయాలని కోరారు. మండల పరిధిలోని తొరూరు గ్రామంలో శ్మశానవాటికకు దారి ఏర్పాటు చేయాలన్నారు. బొజనెత్తం గ్రామంలో ఉన్న శ్మశానవాటికలో ఆక్రమణలను అరికట్టి శ్మశాన వాటికకు హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తాయిమాంబపురంలోని గిరిజనులకు ఇంటి పట్టాలు ఇచ్చి, గృహాలు నిర్మించుకున్న వారికి తగిన విధంగా మౌలిక వసతులు కల్పించాలన్నారు. అలాగే వేణుగోపాల్ సాగర్ ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, దళితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్


సమస్యలు పరిష్కారించాలని విద్యుత్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని కార్వేటీనగరం రోడ్డు సర్కిల్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన తెలిపారు. డివిజన్ స్థాయి కార్మికులతో కూడలి నుండి బయలుదేరి ఎపిఎస్‌పిడిసిఎల్ ఆపరేషన్ డివిజనల్ ఆఫీసు ముందు నిరసన తెలియజేసి, సంభందిత డివిజనల్ అధికారికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ సుధాకర్, ట్రేడ్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేసి నేరుగా జీతాలు ఇవ్వాలని, దశల వారీగా క్రమబద్ధీకరించాలని, కార్మికుడు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా, సంస్థలో ఉద్యోగం ఇవ్వాలని తెలిపారు. ఈ డిమాండ్స్‌ను 27వ తేదీలోపు నెరవేర్చాలని లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు శివప్రసాద్, రజని, గురుమూర్తి, మునిర్మాయ్య, ఆదిశేఖర్, మురళి, పరమేష్, లోకేష్, గజేంద్ర, హరి, భార్గవ్, జ్యోతికుమార్, కార్మికులు పాల్గొన్నారు.

జన్మభూమికి ఉపాధ్యాయులను వినియోగించడం సరైనది కాదు

ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులరెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి యండపల్లి

ప్రజాశక్తి-తిరుపతి సిటి

జన్మభూమి నోడల్ ఆఫీసర్లుగా, గ్రామ కోఆర్డినేటరుగా ఉపాధ్యాయులు నియమించడం సరైనది కాదని, వెంటనే వారిని వెనక్కు తీసుకోవాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి యండపల్లి శ్రీనివాసులరెడ్డి డిమాండు చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ఉపాధ్యాయులను ఇలా జన్మభూమికి కేటాయించడం శోచనీయమన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం బోధనేతర పనులకు టీచర్లను వినియోగించడం సహేతుకం కాదన్నారు. వీధుల్లోకి విద్యార్థులను పంపడం మంచి పద్ధతి కాదని సూచించారు. ఈ సమావేశంలో చంద్రశేఖర్‌రెడ్డి, బాలాజీ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన


అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ సత్యప్రభ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

చిత్తూరు రూరల్ మండలం పచ్చనపల్లిలోని అంగన్వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంఎల్‌ఎ సత్యప్రభ పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్లలో అందుతున్న సౌకర్యాలపై అక్కడి మహిళలు, చిన్న పిల్లలను అడిగి తెలుసున్నారు. సెంటర్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సునీత దేశం నేతలు వైవి రాజేశ్వని, జయచంద్రనాయుడు, శశికర్‌బాబు, కుమార్‌లతో పాటు మండల అధికారులు పాల్గొన్నారు.

జోనల్స్‌లో కె.గొల్లపల్లి విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులతో ప్రధానోపాధ్యాయులు రమేష్

ప్రజాశక్తి-యాదమరి

పూతలపట్టు జోన్‌లో జరిగిన జోనల్స్ పోటీల్లో మండలంలోని కె.గొల్లపల్లి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచి రన్నర్‌గా నిలిచారని ప్రధానోపాధ్యాయులు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు దివ్య, వాణి, భూమిక, బుజ్జి, లక్ష్మి, చంద్రిక, వైష్ణవి, నందిని, లికిత, గాయత్రి, బాల, హైజంప్‌లో ద్వితీయ స్థానం పొందిన తాండవకుమార్‌లు ప్రశంసాపత్రాలు పొందినట్లు పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో పాల్గొన్న లక్ష్మి, వంశీ, నిత్‌లను అభినందించారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

ఈనెల 9వ తేది రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు కుప్పంలో సిఎం పర్యటించే ప్రాంతాలను కలెక్టర్ ప్రద్యుమ్న, ఎస్‌పి రాజశేఖర్‌బాబులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 9వ తేది వరదయ్యపాలెం మండలంలోని చిన్నపాండూరులో అపోలో టైర్ల పరిశ్రమను ప్రారంభిస్తారని, రామకుప్పం మండలం ననియాల ఫారెస్టు ఎలివెంట్ క్యాంపు వద్ద ఏర్పాటు చేసే జన్మభూమి సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు సిఎం పర్యటించనున్న ప్రాంతాలు, జన్మభూమి సభల స్థలాన్ని సిఎం పీఏ మనోహర్‌తో కలిసి కలెక్టర్, ఎస్‌పిలు పరిశీలించారు. ఈనెల 9న సిఎం పర్యటన ఖరారు కావడంతో ఫారెస్టు, పోలీస్, ఆర్‌అండ్‌బి అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. హెలీప్యాడ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. కుప్పం నియోజకవర్గ పరిధిలోని ప్రారంభోత్సవాలు, శిలాపలకాలన్నింటిని జన్మభూమి సభాస్థలి వద్ద వరుసగా ఏర్పాటు చేయించాలని కుప్పం గెస్ట్‌హౌస్‌లో సిఎం రాత్రి బస ఏర్పాట్లు సరిచూసుకోవాలన్నారు. సిఎం పర్యటనపై అధికారులతో త్వరలో సమీక్షించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఓవరాల్ ఛాంపియన్స్‌గా బంగారుపాళ్యం విద్యార్థులు


బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం

గత వారం తవణంపల్లి, యాదమరి, బంగారుపాళ్యం మండలాల్లో పలు క్రీడా కార్యక్రమాలు జరిగాయి. ఇందులో బంగారుపాళ్యానికి 37 బహుమతులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి తెలిపారు. వీరిని బుధవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు.

చంద్రన్న కానుకలు పంపిణీ

ప్రజాశక్తి-నగరి

పట్టణంలోని 20వ వార్డులో కౌన్సిలర్ వికెఎస్ వాసు చేతుల మీదుగా బుధవారం చంద్రన్న కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాకారాజ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకారాజ మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రజల కోసం ప్రవేశపెడుతోందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


చంద్రన్న కానుకలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం


వాగ్దేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-రామచంద్రాపురం

సావిత్రిభాయి పూలే జయంతిని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బుధవారం మండలంలోని కమ్మకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సావిత్రిభాయి పూలే జయంతిని మండల యుటిఎఫ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.వాగ్దేవి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1848లో మొదటి పాఠశాలను ప్రారంభించారన్నారు. పురుషాధిక్యత సమాజంలో బాలికలకు ఆధునిక విద్య అవసరమన్నారు. ఈ అవసరాన్ని గుర్తించి ఆమె ఎన్నో పాఠశాలలను స్థాపించి విద్యను అందించే ఏర్పాటు చేశారన్నారు. అనంతరం ఉపాధ్యాయురాలు కుసుమ మాట్లాడుతూ అగ్ర వర్ణాల వ్యతిరేకతను తట్టుకుని వెన్నుచూపని వనితగా సావిత్రిబాయి పూలే గుర్తింపు పొందారన్నారు. మండలంలోని మహిళా ఉపాధ్యాయులందరూ పాల్గొని యుటిఎఫ్‌శాఖ పక్షాన జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఆర్.నాగేశ్వర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి కె.మనోహర్, కల్పన, సుబ్రమణ్యం, రెడ్డిశేఖర్, చిన్నస్వామి, శంకర్‌రెడ్డి, చంద్రశేఖర్ నాయుడు, రమణప్ప, యుటిఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత దివ్యదర్శన యాత్ర ప్రారంభం

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అమలు చేస్తున్న ఉచిత దివ్యదర్శనం పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ కస్తూరి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ దివ్యదర్శన కార్యక్రమంలో భక్తులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని నిమ్మనపల్లెకు సబంధించిన దివ్యదర్శనానికి వెళ్లే భక్తులు ఈనెల 4వ తేది ఉదయం 8 గంటలకు తహశీల్దార్ కార్యాలయం నుండీ బస్సులు బయలుదేరనున్నట్లు తెలిపారు.

ఎఎస్‌ఐగా మనోహర్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఎఎస్‌ఐగా మనోహర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో గంగాధరనెల్లూరులో పనిచేసి బదిలీపై బంగారుపాళ్యానికి వచ్చారు. గతంలో మండలంలో పనిచేసిన అనుభవం ఉందని ఆయన తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం చురుకైన పాత్ర పోషిస్తానని పేర్కొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

నగరి : పట్టణంలోని 1వ వార్డులో బుధవారం కౌన్సిలర్ లత, అధ్యక్షుడు రామానుజం ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న 24 మంది 1వ వార్డు వాసులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు.


రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం